
BALA CHELIMI

BALA




MARCH 2025

March

₹40

మార్చి - 2025

# బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

**BALA CHELIMI**

**Telugu Children's Monthly Magazine**

సంపుటి : 34 • సంచిక : 6



MARCH - 2025

Editor : **Er. VEDAKUMAR MANIKONDA**

A PUBLICATION OF **CHILDREN'S EDUCATIONAL ACADEMY,** HYDERABAD, TELANGANA

# చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ
హైదరాబాద్ (Regd. 720/1982)

బాల చెలిమి
పిల్లల వికాస పత్రిక

## ప్రచురణలు

చెలిమి అంటే స్నేహం. బడిలో చెలిమి.. ఇంట్లో కలిమి... బాల చెలిమి... చదువు కోడానికి పాఠ్య పుస్తకాలు మినహా ఇతర బాల సాహిత్యం అందుబాటులో లేని విద్యార్థుల్లో లోకజ్ఞానం పెంచి, రోజు రోజుకు విస్తరిస్తున్న ప్రపంచ జ్ఞానాన్ని మారుమూల ప్రాంతాలలోని విద్యార్థులకు కూడా ఎప్పటికప్పుడు అందించి వారిని ఎవరికీ తీసిపోని విధంగా తయారు చేసే లక్ష్యంతో ప్రారంభమైన బాలల వికాస పత్రిక 'బాలచెలిమి'.



చందదారులుగా చేరండి! **బాల చెలిమి** చందదారులను చేర్పించండి!

'యం.వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాసపత్రిక బాలబాలికలకు చేరడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ, పాఠశాల నిర్వహకుల, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**మా చిరునామా: BALA CHELIMI**
"BHOOPATHI SADAN" 3-6-716, St.No. 12,
Himayatnagar, Hyderabad - 500 029.Mob: 9030626288,
Email:desk.chelimi@gmail.com, www.balachelimi.com

**చందా వివరాలు:**
విడి ప్రతి : రూ. 40, వార్షిక చందా : రూ. 400,
2 సం॥లకు : రూ. 750
'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందా మొత్తం చెల్లించవచ్చు.

**ACCOUNT DETAILS :**
Bank Name : Canara Bank
A/C No. : 30101010003714
Branch : Ashoknagar, HYDERABAD.
IFSC Code : CNRB0013010

### తెలంగాణ బడి పిల్లల కథలు



10 పుస్తకాల సెట్ ధర రూ.330 తగ్గింపు ధర రూ. 300

### పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)



10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300


### చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు



# బాల చెలిమి


పిల్లల వికాస పత్రిక

| సంపుటి: Volume: 34 | సంచిక : Issue : 6 | హైదరాబాద్ Hyderabad | మార్చ్ March | పేజీలు Pages 52 | రూ. ₹. 40 |
|---|---|---|---|---|---|





లోపలి పేజీల్లో.......




| | | |
|---|---|---|
| హెూళీ, ఉగాది, పరీక్షలు... మీకోసం ఎదురు చూస్తున్నాయ్...... | మణికొండ వేదకుమార్ | 5 |
| తనను తాను శాస్త్రవేత్తగా మలుచుకున్న మైఖేల్ ఫారడే (సైంటిస్ట్) | జుగాష్‌విలి | 6 |
| అంతర్జాతీయ సంతోషకర దినోత్సవం (సంతోషకర దినోత్సవం) | డా. నీరజ అమరవాది | 7 |
| కనికా టేక్రివాల్ | షీరోస్-256 | 9 |
| తెలుగు అంకెలు (అక్షరం) | వై. మల్లికార్జున రావు | 10 |
| చీమ - బెల్లం (కథ) | కె. శత ప్రమోదన్ | 11 |
| కాలం లెక్కలు - 1 (కాలం) | గోపాలం కె బి | 12 |
| పక్షి పిల్ల (కథ) | లియో టాల్ స్టాయ్ | 13 |
| వేమన పద్యాలు | | 14 |
| ఊరితో స్నేహం | కె. మేఘన | 15 |
| బచ్చాలట (ఆట) | చిన్ననాటి ఆటలు-జ్ఞాపకాల మూటలు | 16 |
| సైలెంట్ ఆర్కిటెక్ట్ ఆఫ్ ఇండియా డా॥ మన్మోహన్ సింగ్ (స్ఫూర్తి) | ఎన్. అక్షయ | 17 |
| తెలంగాణ - చారిత్రక పర్యాటకం (యాత్ర) | దేశరాజు శ్యాంసుందర్‌రావు - స్థపతి | 19 |
| కల్పనా చావ్లా ఏరో ఇంజనీరింగ్ చదువు ఓ పోరాటం! (సైన్స్ వెన్నెల-4) | డా. నాగసూరి వేణుగోపాల్ | 20 |
| రంగుల హెూళి (పండుగ) | డా. అమ్మిన శ్రీనివాసరాజు | 21 |
| తాటి చెట్టు (చెట్టు - చేమ) | కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి | 23 |
| చెలిమి (పాట) | కొమురవెల్లి అంజయ్య | 24 |
| పదిలో జాగ్రత్త (పరీక్షలు) | యం.రాం. ప్రదీప్ | 25 |
| గుడ్డంత బంగారం కొండంత ధీమా! (కార్టూన్) | కె. ఉషారెడ్డి | 26 |
| ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో కోహ్లీ సెంచరీ... (స్పోర్ట్స్) | సచిన్ కోత్వాల్ | 27 |
| ఇంటిలో గూడు - దానికి మేము తోడు వేసవి దాహాన్ని తీర్చుదాం | గుముడాల చక్రవర్తి గౌడ్ | 28 |
| బడికి ఎందుకు రాలేదు? (కథ) | దుర్గమ్ భైతి | 29 |
| నీలిరంగు కుండలో పడిన నక్క కథ | పంచతంత్ర కథ | 30 |
| ఆకాశం (పంచభూతాలు) | బెలగాం భీమేశ్వరరావు | 30 |
| అక్కా తమ్ముడు (కథ) | అనిల్ బత్తుల | 31 |

| | | |
|---|---|---|
| ఫోన్ నెంబర్ చెప్పడం (మాథ్స్ ట్రిక్స్) | అంకెల మామయ్య చంద్రయ్య | 34 |
| పటికం (మారిన బాలల కథ) | పైడిమర్రి రామకృష్ణ | 35 |
| పుస్తక పరిచయం | | 36 |
| అగ్ని - సాంస్కృతిక పునాది (చరిత్ర పాఠాలు-1) | డా. ద్యావనపల్లి సత్యనారాయణ | 37 |
| ఆత్మవిశ్వాసం కీలకం (కవిత) | గద్వాల సోమన్న | 38 |
| చెలిమి క్లబ్ | బాలచెలిమి | 38 |
| ఫాల్గుణ మాసం (నెలలు) | బాల కథా సౌరభం | 39 |
| పక్షులు, జంతువులు (శాస్త్రీయ నామం) | 'ఆరోగ్యం-విజ్ఞానం' | 40 |
| కాకిని తక్కువ అంచనా వేస్తున్నారా? (పక్షి) | మూర్తి కెవివిఎస్ | 41 |
| నేర్చుకుందామా | | 42 |
| కలం-చెలిమి | | 42 |
| భారతీయ రాష్ట్రాలు : నృత్య రూపాలు (జి.కె.) | సచిన్ కోత్వాల్ | 43 |
| గౌను (కథ) | చిట్యాల లక్షణ | 45 |
| చదువు మహిమ (పుస్తక సమీక్ష) | గరిపెల్లి అశోక్ | 46 |
| బాల చెలిమి గ్రంథాలయం మా మంచి నేస్తం (గ్రంథాలయం) | ఎలగొండ రవి | 47 |
| సమాచారం | బాలచెలిమి డెస్క్ | 48 |
| గురజాడ అప్పారావు (వ్యక్తిత్వం) | సువేగ | 50 |

# చెలిమి లేఖలు

మాకు బాలచెలిమి పుస్తకం అంటే చాలా ఇష్టం. ప్రతి నెల మా బుచ్చిరెడ్డి సారు తెచ్చి మాతో చదివిస్తాడు. ఇందులో వస్తున్న కథలు చాలా బాగున్నవి. చెట్టు -చేమ శీర్షిక గురించి ఎన్నో విషయాలు తెలుసుకుంటున్నం. అంతకుముందు బాల చెలిమి పత్రిక అంటే మాకు తెలియదు. మేము కూడా కథలు రాసే ప్రయత్నం చేస్తున్నాం. ఈ మ్యాగజైన్ అందిస్తున్నందుకు బాల చెలిమి ఎడిటర్ వేదకుమార్ సార్‌కు, నిర్వాహకులకు మా పాఠశాల తరఫున ప్రత్యేక ధన్యవాదములు.

**– పగిళ్ల నందు**
పదవ తరగతి
జడ్పీహెచ్ఎస్ చిన్న మాదారం.

బాలచెలిమి పత్రికలో ప్రచురిస్తున్న కథలు మా పాఠశాల విద్యార్థులను కథలు రాయడానికి ఎంతగానో ప్రోత్సహించే విధంగా ఉన్నాయి. మేము కథలు రాయడానికి మాకు బాలచెలిమి పత్రిక వేదికగా నిలిచింది. మమ్మల్ని ప్రోత్సహిస్తున్న మా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోరెడ్డి అశోక్ సార్‌కు, బాలచెలిమి పత్రికలో చెలిమి లేఖలు ద్వారా పరిచయం చేస్తున్న ఎడిటర్ సార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు.

**– గాజంగుల శ్రీవేద**
7 వ తరగతి
జడ్పీహెచ్ఎస్ లక్ష్మీ పూర్
ఆదిలాబాద్ జిల్లా.

*Cover Picture*
***Creative Students***




బొమ్మలు:
**కూరెళ్ల శ్రీనివాస్**
m : 98495 43728


**సంపాదకులు : మణికొండ వేదకుమార్**

BALA CHELIMI
**"CHANDRAM"** 3-6-712/2, St.No.12,
Himayatnagar, Hyderabad - 500 029.
e-mail : edit.chelimi@gmail.com, www.balachelimi.com
Mob: 98480 44713

# హెూళీ, ఉగాది, పరీక్షలు...
## మీకోసం ఎదురు చూస్తున్నాయ్

పిల్లలూ! మీకు హెూళీ మరియు ఉగాది శుభాకాంక్షలు...

హెూళీ పండుగను రంగుల పండుగ అనీ, కాముని పూర్ణిమ అని అంటారు. ఇది శీతాకాలం చివరలో ఫాల్గుణ పూర్ణిమనాడు జరుపుకుంటారు. వసంత ఋతువుకు ఆహ్వానం పలికే పండుగ. ఈ పండుగను ఉత్తరాదిలో ముఖ్యంగా మధుర, బృందావనంలో గొప్పగా జరుపుకుంటారు. ఇప్పుడు మన దేశంలోనూ, ప్రపంచ వ్యాప్తంగానూ వివిధ గాథల నేపథ్యంలో జరుపుకుంటున్నారు. సాంప్రదాయ జానపద నృత్యాలతో, పాటలతో ఆనందంగా గడుపుతారు. ఎరుపు, పసుపు, ఆకుపచ్చ రంగులతో హెూళీ ఆడుతారు. ఈ రంగులు వసంత కాలపు ప్రకృతి సౌందర్యాన్ని సూచిస్తాయి. మిఠాయిలు పంచుకుంటూ ఆత్మీయంగా, ఆనందంగా కలివిడిగా ఉంటారు. వివిధ రంగులతో హెూళీని ఆడుకుంటున్నాం.

పిల్లలూ... మీరూ ఈ పండుగను ఎంజాయ్ చేయండి. కానీ ఈ రంగులన్నీ, హాని చేసే రసాయనాలు. వీటిని చల్లుకొనేటప్పుడు కళ్లలో పడకుండా జాగ్రత్తలు పాటించాలి. త్వరగా ఆట ముగించి వేడి నీటితో స్నానం చేసి చర్మాన్ని శుభ్రపరుచుకోవాలి. ఆనందం ఆరోగ్యానికి ఆటంకం కాకూడదు కదా!

ఉగాది మీకు తెలిసిన పండుగ. ఉగాదితో కొత్త తెలుగు సంవత్సరం ప్రారంభమవుతుంది. శ్రీ క్రోధినామ సంవత్సరం నుంచి శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలోకి ప్రవేశిస్తున్నాం. ఇది తెలుగు వారి మొదటి పండుగ. వసంత ఋతువు ప్రారంభం. ఈ తొలి పండుగను తెలుగు వారంతా అత్యంత ఉత్సాహంతో జరుపుకుంటారు. ఇంటిని పూలతో, మామిడాకులతో అలంకరిస్తారు. ఇంటిల్లిపాదీ కొత్త బట్టలతో, పిండి వంటలతో, బంధుమిత్రులతో సంబరం చేసుకుంటారు. పూజలు చేసి ఉగాది పచ్చడి పంచుతారు. వేపపూలు, పచ్చిమామిడి, చింతపండు, బెల్లం, మిరియాల పొడి, అరటిపండ్లు, ఉప్పు, కొబ్బరితో ఈ ఉగాది పచ్చడి తయారు చేస్తారు. తీపి, పులుపు, కారం, ఉప్పు, వగరు, చేదు రుచులతో ఈ పచ్చడి జీవితంలో ఎదురయ్యే మంచి చెడులను, కష్ట సుఖాలను సంయమనంతో స్వీకరించాలనే సందేశానిస్తుందని ప్రజల విశ్వాసం.


హెూళీ, ఉగాది సంబరాల మధ్యే మీ సంవత్సరాంత పరీక్షలు వస్తున్నాయ్... పరీక్షల టెన్షన్ ఒకవైపూ, రోజురోజుకీ పెరిగిపోతున్న ఎండలు ఒక వైపూ. మీరు జాగ్రత్తగా ఉండాలి. టెన్షన్ పడకండి. ప్రశాంతంగా ఉండండి. ప్రణాళికబద్ధంగా మీ పాఠాలను రివ్యూ చేసుకోండి. పరీక్షలకు ప్రిపేర్ కావడానికి మంచి పద్ధతులున్నాయి. పరీక్షలు సులభంగా రాయడానికి బాలచెలిమి ఈ మార్చి సంచికలో ఉన్నాయి. పరీక్షలు అనే శీర్షిక (పదిలో జాగ్రత్తలు) శ్రద్ధగా చదవండి. పరీక్షలంటే భయం పోతుంది. పరీక్షలు బాగా రాస్తారు, విజయం సాధిస్తారు.

సమ్మర్ హాలిడేస్ వస్తున్నాయ్. ఎంజాయ్ చేయడానికి సిద్ధంగా ఉండండి...


వేదకుమార్.యం

(మణికొండ వేదకుమార్)


ఎడిటర్ బాలచెలిమి







# తనను తాను శాస్త్రవేత్తగా మలుచుకున్న
# మైఖేల్ ఫారడే



విద్యుదయస్కాంత తత్వం, విద్యుత్ రసాయనక శాస్త్ర అధ్యయనం కోసం కృషి చేసిన ఆంగ్ల శాస్త్రవేత్త మైఖేల్ ఫారడే. మైఖేల్ ఫారడే ఇంగ్లండ్‌లో 1791 సెప్టెంబర్ 21న జన్మించాడు. ఇతని తండ్రి జేమ్స్ ఫారడే ఒక కమ్మరి. మైఖేల్ తన బాల్యమంతా పేదరికపు కష్టాలను అనుభవించాడు. పదమూడు సంవత్సరాల వయసులో సెకండరీ స్కూలింగ్ పూర్తి కాకుండానే పాఠశాలను విడిచిపెట్టాడు. వార్తా పత్రికలను, పుస్తకాలను అమ్మేవాడు. బుక్ బైండర్‌గా పని చేసాడు.

మైఖేల్ ఆలోచనాశీలి. ప్రయోగవాది. రాయల్ ఇన్‌స్టూట్‌లో వారానికి 6 డాలర్ల జీతంతో ప్రయోగశాల సహాయకుడిగా చేరాడు. ప్రతిరోజూ ఏదో ఒక ప్రశ్నతో ప్రయోగశాలలో అడుగుపెట్టేవాడు. తన ప్రశ్నకు 'అవును' 'లేదు' అనే తగినంత సమాధానం వచ్చేవరకు సమాధానపడే వాడు కాదు. అకడమిక్ విద్య లేకుండానే తనను తాను ఒక శాస్త్రవేత్తగా తయారు చేసుకున్న ప్రతిభాశాలి మైఖేల్ ఫారడే.

అతని ప్రధాన ఆవిష్కరణలలో విద్యుదయస్కాంత ప్రేరణ, దయా మాగ్నెటిజమ్, విద్యుద్విశ్లేషణ వంటి అంతర్లీన సూత్రాలున్నాయి. ఏకముఖ విద్యుత్ ప్రవాహం ప్రవహిస్తున్న వాహకం చుట్టూ ఉన్న అయస్కాంత క్షేత్రం అనే భావనకు ఆధారాన్ని స్థాపించాడు. విద్యుత్ అయస్కాంత రోటరీ పరికరాల ఆవిష్కరణలు విద్యుత్ మోటారు సాంకేతికతకు పునాదులు వేసాయి. రసాయన శాస్త్రవేత్తగా ఫారడే బెంజీన్‌ను కనుగొన్నాడు. క్లోరిన్ యొక్క కాథ్రేట్ హైడ్రేట్‌ను పరిశోధించాడు. బున్సెన్ బర్నర్ మొదటి రూపాన్ని ఆక్సీకరణ సంఖ్యల వ్యవస్థలనూ కనుగొన్నాడు. యానోడ్, కాథోడ్, ఎలక్ట్రోడ్, అయాన్ వంటి ప్రాచుర్యం పొందిన పరిభాషను కనుగొన్నాడు. రాయల్ ఇనిస్టూట్‌లో మొదటి రసాయన శాస్త్ర ప్రొఫెసర్ అయ్యాడు. ఈ ప్రయోగాత్మక శాస్త్రవేత్త తన ఆలోచనలను స్పష్టమైన, సరళమైన భాషలో తెలియజేసాడు.

అనేక ప్రతిష్ఠాత్మకమైన పురస్కారాలు అందుకున్నాడు. కెపాసిటెన్స్ ఎస్.ఐ. ప్రమాణానికి ఇతని గౌరవార్థం ఫారడ్ అని పేరు పెట్టారు. ఐన్‌స్టీన్ తన ప్రయోగశాలలో న్యూటన్, జేమ్స్‌క్లార్క్, మాక్స్‌వెల్లీ చిత్రాలతో పాటు ఫారడ్ చిత్రాన్ని కూడా పెట్టుకున్నారు. మైఖెల్ ఫారడే 1867 ఆగస్ట్ 25న మరణించారు. ఫారడే జ్ఞాపకార్థం, గౌరవార్థం వివిధ సంస్థలు అతని పేరు మీద బహుమతులు, పురస్కారాలు అందిస్తున్నాయి.

– జుగాష్‌విలి
బాలచెలిమి డెస్క్

# అంతర్జాతీయ సంతోషకర దినోత్సవం



చిన్నారులూ.. మీ అందరికి సంతోషకరమైన రోజు ఏది? మీ జన్మదినం (Happy Birth day) కదా! అలాగే మీ అందరికీ ఆనందాలని పంచే పండుగలు హాపీ న్యూ ఇయర్, హాపీ దీపావళి అలా అన్ని పండుగలని సంతోషంగా జరుపుకోవాలని కోరుకుంటాం. సంతోషంగా ఉండాలని, 'సంతోషమే సగం బలం' అని పెద్దలు చెబుతుంటారు. అది కొంత వరకు నిజమే. అయితే సంతోషాన్ని ఎక్కడి నుండి తెచ్చుకోవాలి. అందని ద్రాక్ష పండులాంటిదా! లేక అంగడిలో కొనగలిగేదా. అసలు సంతోషం ఏ వస్తువులో ఉంటుందనే అనుమానాలు, ప్రశ్నలందరికీ వస్తుంటాయి.

Happiness is not something ready-made. It comes from your own actions - Dalai lama.

మనుషులు సామాజిక జంతువులు. ఇతరులతో అనుబంధాలను పెంచుకున్నప్పుడు మాత్రమే అభివృద్ధి చెందగలరు. సంతోషకరమైన జీవితానికి ఇతరుల పట్ల దయ, కరుణ, శ్రద్ధ అనేవి అవసరం. సంతోషానికి మూలం మన లోపలే ఉంటుంది. మన మనస్సు ప్రశాంతంగా ఉంటే మన ఆలోచనలు పాజిటివ్‌గా, రియలిస్టిక్‌గా ఉన్నప్పుడు ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ధైర్యంతో ముందుకు వెళ్లగలుగుతాము. మనిషి అభివృద్ధే కాదు దేశాభివృద్ధి సైతం సంతోషంగా ఉండే సమాజంతో ముడిపడి ఉంటుందని మానసిక శాస్త్రవేత్తలు కూడా చెబుతున్నారు. వరల్డ్ హాపినెస్ ఇండెక్స్-2024 ప్రకారం చిన్న దేశాలైన ఫిన్లాండ్, డెన్మార్క్, ఐస్‌లాండ్ దేశాలు వరుసగా మూడుస్థానాల్లో నిలిచాయి. 143 దేశాల ప్రజల మనోభావాలను పరిశీలించి ఈ నివేదికను రూపొందించారు. ఆర్థిక అంశాల ఆధారంగా సంతోషాలని కొలవలేదు. ప్రజల సంతోషానికి కారణం వారి జీవన విధానమే. ప్రకృతికి దగ్గరగా, స్వేచ్ఛగా, ఐకమత్యంగా ఉంటూ, ఉచిత విద్య, వైద్య సదుపాయాల వల్లనే ప్రజలు సంతోషంగా, సంతృప్తిగా జీవిస్తున్నట్లు గ్రహించారు.

ప్రజల జీవితంలో సంతోషం ఎంత అవసరమో అవగాహన పెంచేందుకు ఐక్యరాజ్యసమితి మార్చి 20వ తేదీని "ఇంటర్నేషనల్ డే ఆఫ్ హాపినెస్"గా 2012లో ప్రకటించింది. ఈ సందర్భంగా సంతోషంగా ఉండడానికి కొన్ని చిట్కాలు కూడా చెప్పింది. అందులో ముఖ్యమైనది మన జీవితంలో సంతోషంగా ఉండాలంటే ఎవరితోనూ పోల్చుకోకూడదు. ఎందుకంటే అందరి జీవితాలలో కష్టసుఖాలు, ఎత్తుపల్లాలు ఉంటాయి. వాటిని ఎదుర్కొంటూ సంతోషంగా ఉండాలి. అంతేకాదు నిజమైన సంతోషం చిన్న చిన్న విషయాలలోనే ఉంటుంది. దీనికి ఉదాహరణగా చిన్న కథ చెబుతాను. ఒకతను బెలూన్లు అమ్ముతున్నాడు. ఒక చిన్ని పాప బెలూన్ కొనుక్కుంది. దానిని చేతిలో పట్టుకొని సంతోషపడింది, ఒక బాబు రంగురంగుల బెలూన్లను కొని, ఆకాశంలోకి ఎగరేసి ఇంద్రధనస్సు అంటూ ఆనందించాడు. ఇక్కడ బెలూన్లు అమ్మేవాడు, కొనుక్కున్న పాప, పైకి ఎగరేసిన బాబు అందరూ సంతోషంగా ఉన్నారు. అంటే సంతోషం వస్తువులో లేదు. మన భావనలో ఉంది.

ఇటీవలి కాలంలో చిన్నచిన్న వైఫల్యాలకు, లేదా అమ్మానాన్నలు టి.వి చూడద్దన్నారని, సెల్ ఫోన్ కొనివ్వలేదని, అమ్మానాన్నలు మొబైల్ గేమ్ ఆడద్దన్నారని ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వింటున్నాం కదా. దీనికి ముఖ్యమైన

కారణం మనసే. దానికి మనం మంచిగా ట్రైనింగ్ ఇవ్వాలి. అప్పుడు మన మనసు, బుద్ధి కలిసి మనలో సంతోషానికి దోహదపడే హార్మోన్‌లను విడుదల చేస్తుంది. వీటిని హాపీ హార్మోన్‌లని, ఫీల్ గుడ్ హార్మోన్‌లని పిలుస్తారు. ముందుగా మనం ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని, పాజిటివ్ ఆలోచనా విధానాన్ని అలవరచుకోవాలి. మనకి సంతోషాన్ని ఇచ్చే హార్మోన్లు ముఖ్యంగా నాలుగు. అవి ఎండార్ఫిన్స్, డోపమైన్, సెరెటోనిన్, ఆక్సిటోసిన్.

లంచ్ బాక్స్‌లో అమ్మ ఇష్టమైనవి పెడితే, మీకు ఆనందంగా అనిపిస్తుందా! అలాగే ఆటలు ఆడినప్పుడు శరీరం అలసిపోయినా, మనసు సంతోషంగా ఉండడాన్ని గమనించారా. దానికి కారణం మీకు తెలియకుండానే శరీరంలో 'ఎండార్ఫిన్' అనే హార్మోన్ విడుదలకావటమే. అలాగే మీరు క్లాస్‌లో టీచర్ అడిగిన ప్రశ్నకు వెంటనే సమాధానం చెబితేనో, లేక మీ ప్రాజెక్ట్ సకాలంలో పూర్తి చేస్తే, మీకు తెలియకుండానే మీ పెదవులపై చిరునవ్వు కనిపిస్తుంది. దీనికి కారణం మీ లక్ష్యాలని పూర్తిచేసినప్పుడు సంతృప్తితో కూడిన సంతోషాలని ఇచ్చే 'డోపమైన్' అనే హార్మోన్. ఎప్పుడైనా బయటికి వెళ్లినప్పుడు ఎవరైనా అడ్రస్ అడిగితేనో, లేక ఇంట్లో తాతయ్యకో, అమ్మమ్మకో కావలసిన పని చేసిపెట్టినప్పుడు మీరు ఒక విధమైన ఆనందభావనలో ఉండడాన్ని గమనించారా! దానికి కారణం మీలోని 'సెరెటోనిన్' అనే హార్మోన్. వేసవి సెలవులు రాగానే అమ్మమ్మ దగ్గరకో, మామయ్య దగ్గరకో వెళ్దామనుకుంటారా, అలాగే పండుగలప్పుడు పిన్ని దగ్గరకో, అత్తయ్య దగ్గరకో వెళ్తుంటారా. అలా ఇష్టమైన వాళ్ల దగ్గరికి వెళ్లడం, స్నేహితులతో భుజం మీద చేతులు వేసి మాట్లాడుతుంటారా. బంధుత్వాలను, అనుబంధాలను పెంచుకుంటే 'ఆక్సిటోసిన్' అనే మరో ఫీల్ గుడ్ హార్మోన్ మన శరీరంలో విడుదల అవుతుంది. అంటే మనలోని సంతోషాలకి కారణాలు చాలా ఉన్నాయి. అవి పర్యావరణానికి సంబంధించినవి కావచ్చు. సామాజిక మైనవికావచ్చు.

వీటిలో భాగంగా సంతోషాలని పెంచే కొన్ని విషయాలను గురించి తెలుసుకుందాం. అవి మన దగ్గర ఉన్న వాటితో ఆనందంగా, సంతృప్తిగా ఉండడం. అవసరానికి పొరుగువారికి సాయపడడం, కొత్త విషయాలను నేర్చుకోవడం, తగినంత నిద్ర, వ్యాయామం, సమతుల ఆహారం తీసుకోవడం. మీ బలాలను గుర్తించడం. జీవితంలో ఒక లక్ష్యం పెట్టుకొని సాగటం. ఇలా అర్థవంతంగా, ప్రణాళికతో సాగితే సమస్యలు వస్తూపోతూ ఉంటాయి. సంతోషం మిమ్మల్ని అంటిపెట్టుకుని ఉంటుంది.

"సంతోషం సగం బలం కాదు సంతోషం సంపూర్ణ బలం"

**– డా. నీరజ అమరవాది**
m : 9849160055


చందదారులుగా చేరండి! బాల చెలిమి చందదారులను చేర్పించండి!

'ఎం.వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాసపత్రిక బాలబాలికలకు చేరడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ, పాఠశాల నిర్వహకుల, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**మా చిరునామా :**
BALA CHELIMI
"CHANDRAM" 3-6-712/2,
St.No. 12, Himayatnagar
Hyderabad - 500 029.
Mob: 9030626288
E-mail:desk.chelimi@gmail.com,
www.balachelimi.com

**చందా వివరాలు :**
విడి ప్రతి : రూ. 40
వార్షిక చందా : రూ. 400
2 సం॥లకు : రూ. 750
'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.

**ACCOUNT DETAILS :**
Bank Name : Canara Bank
A/C No. : 30101010003714
Branch : Ashoknagar, HYDERABAD.
IFSC Code : CNRB0013010

# కనికా టేక్రివాల్

## ఆకాశమే హద్దుగా కొత్త దిగంతాల ఆవిష్కర్త

జెట్‌సెట్‌గోకి కనికా టేక్రివాల్ (1990 జూన్ 7-) వ్యవస్థాపకురాలు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి కూడా, విమానాలను సమన్వయపరిచే వినూత్న అంకుర సంస్థ ఈ జెట్‌సెట్‌గో, ప్రైవేట్ విమానాలు, హెలికాప్టర్‌ల నిర్వహణ, బాడుగుల వ్యవహారాలు కూడా ఈ సంస్థ చూస్తుంది. క్యాన్సర్‌పై గెలిచిన తరవాత 22 సంవత్సరాల వయస్సులో కనిక ఈ ప్రయాణాన్ని ప్రారంభించటం విశేషం.

కనిక ముంబై కాలేజీలో బి.ఎ.లో. అర్థశాస్త్రం చదివారు. ఆ తరవాత ఫ్రాన్స్‌లోని కోవెంట్రీ కాలేజీలో ఫైనాన్స్‌లో ఎంబీఏ పూర్తి చేశారు.

మార్వాడీ కుటుంబంలో కనిక పుట్టారు. తల్లిదండ్రుల నుంచి వ్యతిరేకత, ఆడపిల్ల అన్న కారణంగా సమాజం నుంచి చిన్నచూపును ఎదుర్కొన్నారు. అయినప్పటికి పట్టుదలతో ముందుకు సాగి, ఒక దశాబ్దం తరవాత 10 ప్రైవేట్ జెట్ విమానాలకు యజమాని అయ్యారు.

భారత దేశంలో వ్యక్తిగత విమానాలు, హెలికాప్టర్‌లు బాడుగకు ఒక ప్రత్యేక వ్యాపార కూడలిగా కనిక నాయకత్వంలోని జెట్‌సెట్‌గో కొత్తదారులు వేసింది. ఆమె విమానయాన పరిశ్రమకు అందించిన వినూత్న సహకారం వల్ల ఫోర్బ్స్, బీబీసీ లాంటి ప్రతిష్ఠాత్మక వేదికల నుంచి గుర్తింపు, అనేక ప్రశంసలు పొందారు. ఫోర్బ్స్ ఆసియా 30 అండర్ 30లో, బీబీసీ 100 ఉమెన్‌లో గౌరవాన్ని పొందడం ఈ రంగంలో ఆమె ప్రాముఖ్యాన్ని చాటుతుంది.

కనిక అద్భుత వృత్తి జీవితం ఆమె పట్టుదలకు నిదర్శనం. సమర్థ వ్యాపార లక్షణం, అలుపెరగని ఆవిష్కరణలు భారతీయ విమానయాన పరిశ్రమలో తనకంటూ ఒక ముఖ్య స్థానాన్ని ఏర్పరచుకునేలా చేశాయి.




– 'షీరోస్-256 ఇన్‌స్పైరింగ్ వుమెన్ ఫ్రమ్ ఇండియా' నుండి....

### మీకు తెలుసా?

కనిక నిర్వహించే జెట్‌సెట్‌గో సంస్థ వేలాది విమానాలను నిర్వహిస్తూ లక్షలాది ప్రయాణికులను గమ్యానికి చేరుస్తోంది.

# తెలుగు అంకెలు



మన భాష రాతలో అంకెలు కూడా ఒక భాగం సరదాగా ఖాళీ సమయంలో ఏ అంకె ఎలా ఉంటుందో ఎలా రాయాలో నేర్చుకుందాం.


| | |
|---|---|
| సున్న - ౦ | ఒకటి - ౧ |
| రెండు - ౨ | మూడు - ౩ |
| నాలుగు - ౪ | ఐదు - ౫ |
| ఆరు - ౬ | ఏడు - ౭ |
| ఎనిమిది - ౮ | తొమ్మిది - ౯ |

## రాయడం మర్చిపోకండి

ప్రపంచం వేగంగా మారిపోతుంది. కంప్యూటర్ కీబోర్డుతోనే తప్ప పేపరూ, పెన్నుతో పని చేయడం తగ్గిపోతోంది. ఇదిలానే కొనసాగితే మనిషి మెదడు పనితీరులో లోపాలు తలెత్తే అవకాశం లేకపోలేదు అంటున్నారు స్టాన్ఫర్డ్ యూనివర్సిటీ పరిశోధకులు. రాయడం అనేది కేవలం చదువులో భాగం మాత్రమే కాదు. ఇది మానసిక వికాసానికి కూడా దోహద పడుతుంది.

- వై. మల్లికార్జున రావు
డైరెక్టర్, మహా అకాడెమి, m : 9966961642





# చీమ - బెల్లం

చీమకు బెల్లం అంటే ఎంత ఇష్టమో మనందరికీ తెలుసు. ఈ కథలో కూడా ఒక చీమ తనకి చాలా ఇష్టమైన బెల్లాన్ని తినడానికి ఒక ఇంట్లోకి దూరింది. బెల్లం కోసం ఇల్లు మొత్తం వెతికింది. ఎలా అయితేనేం బెల్లం దగ్గరకు వెళ్ళింది. అది చూసిన బెల్లం ఆ చీమను యాజమాని వచ్చే వరకు ఎలా అయినా ఆపాలని చీమతో ఇలా పలికింది. చీమ చీమా! నువు నన్ను తినాలంటే ఒక షరతు అంది. చీమ సరే అని ఏమిటో చెప్పమన్నది. నువ్వు నన్ను తినాలంటే ఒక ప్రశ్నకు సమాధానము చెప్పాలని అంది. ఓ అంతేనా ఇట్టే చెప్పేస్తాను అడుగు అంది. ఇప్పుడు మనం వున్న గది ఎంత పొడవు ఉంటుంది అని అడిగింది. వెంటనే చీమ ఓ ఇంతేగా ఇప్పుడే చెప్పేస్తాను అని ఆ గది కొలవడం మొదలుపెట్టింది. అలా కొలుస్తూ ఉండగా ఆ ఇంటి యాజమని వచ్చాడు. ఆ చీమ ఆ యజమాని కాళ్ళ కింద చనిపోయింది. అది చూసిన బెల్లం వెంటనే ఊపిరి పీల్చుకుంది. యజమాని సరాసరి బెల్లం దగ్గరకు వచ్చి బెల్లాన్ని చితకొట్టడం మొదలుపెట్టాడు అది చూసి బెల్లం బోరు బోరు ఏడుస్తూ ఈరోజు చీమలాగే నాకు కూడా కాలం అయిపోయింది అనుకుంది.


– కె. శత ప్రమోదన్

నాలుగో తరగతి, అరవింద హైస్కూల్,

కుంచనపల్లి, గుంటూరు జిల్లా.

e : schoolaravinda22@gmail.com

# కాలం లెక్కలు-1




ఒక సంవత్సరం గడిచిపోయింది అని అందరూ అనుకుంటారు. నిజానికి తెలుగు వాళ్ళ సంవత్సరం చరిత్ర మాసంతో మొదలవుతుంది. ఉగాది అని ఒక పండుగ ఉంటుంది. నిజానికి ఆ పండుగను చాలా మంది పట్టించుకోరు. మహా అయితే కొత్త సంవత్సరంలో గ్రహచారం ఎలా ఉంటుందని కొంత మంది తెలుసుకోవడానికి ప్రయత్నిస్తారు. కానీ ప్రపంచమంతా జనవరి మొదటి తారీకు వచ్చిందంటే అదేదో ప్రళయం వచ్చినట్టు పండుగ చేసుకుంటారు. ప్రళయం వస్తే ఎవరు పండగ చేసుకోరు. ఆనందించవలసిన సమయం వస్తే పండగ చేసుకుంటారు. కాలాన్ని లెక్కించి, మన బతుకులు కొలత ప్రకారం ఒక సంవత్సరం గడిచింది అనుకోవడం ఆనందించవలసిన సమయమే. కనుకనే కొత్త సంవత్సరం పండుగ, కేకులు. పార్టీలు, పాటలు, గందరగోళం వగైరా.

ఎంతమంది గమనించారో తెలియదు కానీ, అక్టోబర్, నవంబర్, డిసెంబర్ అనే మాటలలో వెనుక నుంచి ఎనిమిది, తొమ్మిది, పది అనే అంకెలు తొంగి చూస్తాయి. అయినా అమాయకంగా అందరూ డిసెంబర్‌ను పన్నెండవ నెల అంటారు. కనీసం అనుకుంటారు. అంటే గింటే పాత లెక్కల ప్రకారం సంవత్సరంలో డిసెంబర్ 12వ నెల కాదన్నమాట. అసలు మానవ నాగరికత మొదలైన నాటి నుంచి, మనిషి నేర్చుకున్న తెలివితేటల క్రమంలో కాలాన్ని గ్రహించడం అంటే లెక్కవేయడం, అన్నిటికన్నా గజిబిజి లెక్క అని తెలివిగలవారు అందరూ ఒప్పుకున్నారు. ఇవాళటి వరకు ప్రపంచం మొత్తంలో అందరూ అంగీకరించే క్యాలెండర్ ఈ జనవరి మొదటి తారీకుతో మొదలయ్యే గ్రెగోరియన్ క్యాలెండర్ మాత్రమే.

తెలుగు పంచాంగం చంద్రుని ఆధారంగా లెక్కింపు పడుతుంది. చంద్రుడు చిత్రా నక్షత్రం దగ్గర ఉండేది చైత్ర మాసం. విశాఖ నక్షత్రం దగ్గర ఉంటే వైశాఖమాసం. కానీ మనకు కాలం అనగానే సూర్యుడు మాత్రమే గుర్తుకు వస్తాడు. తమిళులు సౌరమానం ప్రకారం పంచాంగం లెక్కించు కుంటారు. సూర్యుడు ఏ రాశిలో ఉంటే ఆ నెలకు ఆ రాశి పేరు వస్తుంది. సింహరాశిలో సూర్యుడు ఉన్నప్పుడు సింహ మాసం వస్తుంది. ఈ తేడాలు చాలా మందికి అసలు పట్టనే పట్టవు. తమిళ సంవత్సరాది మన తెలుగు సంవత్సరాదితో రాదు అన్న సంగతి చాలామందికి తెలియకపోవచ్చు.

చాలా సులభంగా సూర్యుడు అన్నాము. తెలుగు వ్యాకరణం ప్రకారం **డు ము వు లు** ప్రథమ విభక్తి. సూర్యుడు అంటే సూర్యుడు. సూర్యము లేదా సూర్యం అన్నప్రదం భక్తి. ఉండేది ఒకే సూర్యుడు కనుక **వు** ప్రసక్తి అక్కడ రాలేదు. విష్ణువును విష్ణుడు అనడం కూడా ఉంది. మొత్తానికి ఈ సూర్యుడు, విష్ణుడు మగవాళ్ళు అని అందరూ భావిస్తున్నారన్న ఆలోచన మనకు అందనే అందనంత మామూలు అయిపోయింది. సూర్యుడు మగవాడు. సూర్యదేవాలయా లలో విష్ణుమూర్తి అవతారాలకు ఎవరికీ లేని విధంగా సూర్యునికి మీసాలు ఉంటాయి. సూర్యునికి ఒక రథం కూడా ఉంటుంది. దానికి అనూరుడు అని ఒక సారథి ఉంటాడు. అనూరుడు అంటే తొడలు లేనివాడు అని అర్థం. ఇదంతా సంప్రదాయంగా మనవాళ్లు చెప్పుకునే పద్ధతి. ఇంతకు సూర్యుడు మగవాడా? ఆయనకు ఛాయాదేవి అని భార్య ఉందా? పురాణాలలో అయితే ఉంది! మామూలు ప్రపంచంలో సంగతి మనం కాసేపు పక్కన పెట్టి సూర్యుని గురించి ప్రపంచంలో ఉన్న సాంప్రదాయిక సమాచారాన్ని కొంత చూచే ప్రయత్నం చేస్తే చాలా సరదాగా ఉంటుంది.

– గోపాలం కె బి
m : 98490 62055

కథ



# పక్షి పిల్ల



ఆ రోజు సెర్యోష పుట్టినరోజు. సెర్యోషకి ఎన్నో కానుకలు- బొంగరాలూ, గుర్రపు బొమ్మలూ, బొమ్మల పుస్తకాలూ, ఇంకా ఎన్నో వచ్చాయి. అన్నిటిలోకి మామయ్య ఇచ్చిన కానుక సెర్యోషకి బాగా నచ్చింది. అది పక్షులను పట్టే వల. ఆ వల ఒక చట్రానికి తగిలించి, దానికి చిన్న బల్లచెక్క అమర్చి ఉంది. వల వెనక్కి మడిచేసి, బల్లచెక్కపైన గింజలు ఉంచితే, పక్షి అందులో చిక్కుకుంటుంది. సెర్యోషకి భలే సరదా వేసింది. ఆ వలను తల్లికి చూపించడానికని ఇంట్లోకి పరిగెత్తాడు.

"ఇది మంచి ఆటవస్తువు కాదురా. అయినా, నీకు పక్షిపిల్లలు దేనికిరా? వాటిని ఎందుకు బాధ పెట్టాలి?" తల్లి అంది.

"వాటిని పట్టి, పంజరంలో పెడతానే, అమ్మా! అవి పాడతాయి, వాటికి తిండిపెట్టి పెంచుతానే!" అన్నాడు సెర్యోష.

తల్లిని అడిగి గింజలు తెచ్చుకుని బల్లచెక్కపై ఉంచి, వలను తోటలో ఉంచాడు సెర్యోష. పక్షిపిల్లలు వస్తాయేమో అని చూస్తూ సెర్యోష అక్కడే కూర్చున్నాడు. కాని పిట్టలు సెర్యోషని చూసి భయపడి, వల దగ్గర వాలలేదు. సెర్యోష అలానే కూర్చున్నాడు. ఇంతలోకి భోజనం వేళ అయింది. వల అలాగే ఉంచేసి సెర్యోష ఇంట్లోకి వెళ్లాడు. భోజనం అయ్యాక సెర్యోష అక్కడికి వచ్చి చూశాడు. వల మూసుకుపోయింది, తళతళ మెరుస్తున్న పక్షిపిల్ల ఒకటి వలలో ఉంది. సెర్యోషకి భలే సంతోషం వేసింది. పక్షిపిల్లను పట్టుకుని ఇంట్లోకి పరిగెత్తాడు.

"అమ్మా! నేను పట్టిన పక్షిపిల్లని చూడవే! ఇది కోకిలేనే, అమ్మా! చూడవే, ఎంత బాగా మెరిసిపోతోందో!"

"ఇది జీనువాయి పిట్ట. దాన్ని అల్లరిపెట్టకు. దాన్ని వదిలిపెట్టేస్తే నయంరా!" అంది తల్లి. "అబ్బా వదిలిపెట్టనే! నేను దాన్ని పెంచుతాను. దానికి తిండిపెట్టి, నీళ్లు ఇస్తాను."

ఆ పక్షిపిల్లను సెర్యోష పంజరంలో పెట్టాడు. దానికి రెండు రోజులు గింజలు పెట్టి

నీళ్లు ఇచ్చాడు, పంజరం శుభ్రం చేశాడు. మూడో రోజుకి ఆ పక్షిపిల్ల ఊసే మరచిపోయాడు.


నీళ్లు మార్చలేదు.


అప్పుడు తల్లి, "ఒరేయ్, చూశావా! నీ పక్షిపిల్ల మాటే మరచిపోయావు. ఇహ దాన్ని వదిలిపెట్టడమే మంచిదిరా!" అంది.

"అబ్బా, నేను వదిలిపెట్టను! మరిచిపోయాను, అంతే! ఇహనుంచి మరచిపోను. ఇప్పుడే వెళ్లి నీళ్లు మార్చి, పంజరం శుభ్రం చేస్తాను!" అన్నాడు సెర్యోష.

సెర్యోష పంజరంలోకి చేయి దూర్చి శుభ్రంచేయడం మొదలుపెట్టాడు. పక్షిపిల్ల భయపడిపోయి, రెక్కలు తపతప కొట్టుకుంటూ పంజరం చుట్టూ ఎగిరింది. పంజరం శుభ్రం చేసి, మంచినీళ్లు తెచ్చేందుకు వెళ్లాడు.

సెర్యోష పంజరం తలుపు మూయడం మరచిపోయాడన్న సంగతి తల్లి చూసి, "ఒరేయ్, సెర్యోష! పంజరం తలుపు మూసేయ్, లేకుంటే పక్షిపిల్ల పంజరంలో నుంచి ఎగిరిపోయి గదిలో దేనినైనా ఢీకొని చచ్చిపోతుంది," అంటూ కేక వేసింది.





అలా అని ఆమె ఇంకా అన్నదో లేదో, పక్షిపిల్ల తన రెక్కలను స్వేచ్ఛగా విప్పుకోవచ్చునని ఎంతో ఆనందించి, పంజరంలో నుంచి బయటికి వచ్చేసి, గదిలో ఎగిరి, కిటికీ నుంచి పారి పోబోయింది. కాని, కిటికీకి ఉన్న అద్దాన్ని చూసుకోక, అద్దానికి గుద్దుకుని, కింద పడిపోయింది.

సెర్యోష మంచినీళ్లు తీసుకుని గదిలోకి వచ్చాడు. కింద ఉన్న పక్షిపిల్లను తీసి, పంజరంలో పెట్టాడు. పక్షిపిల్ల బతికే ఉంది, కాని రెక్కలు చాపుకుని బోరగిలబడి, ఎగ రొజుకుంటోంది. దానిని చూసి వలవల ఏడవడం మొదలుపెట్టాడు సెర్యోష.

"అమ్మా! నేను ఇప్పుడు ఏమి చెయ్యాలి?"

"ఇప్పుడు ఏమీ చేయలేవు."

ఆ రోజంతా సెర్యోష ఆ పంజరం దగ్గర నుంచి కదల్లేదు. పక్షిపిల్ల వైపు చూస్తూ కూర్చున్నాడు. పక్షిపిల్ల బోరగిలబడే ఉంది, శ్వాస త్వరత్వరగా వస్తోంది. సెర్యోష నిద్రపోవడానికి వెళ్లే ముందు చూశాడు: పక్షిపిల్ల ఇంకా బతికే ఉంది. చాలాసేపటి వరకు సెర్యోషకి నిద్రపట్టలేదు. కన్ను మూతపడే సరికల్లా పక్షిపిల్ల అలా బోరగిలపడి ఎగ ఊపిరి తీయడమే కళ్ల ఎదుట కనబడేది. సెర్యోష ఉదయాన లేచి, పంజరం దగ్గరకి వెళ్లి చూసేప్పటికల్లా పక్షిపిల్ల వెల్లకిలపడి ఉంది. కాలివేళ్లు ముడుచుకుపోయి ఉన్నాయి, వళ్లు కట్టెబారిపోయింది. ఆనాటినుంచి సెర్యోష ఇక ఎన్నడూ పక్షుల్ని పట్టలేదు.

**- లియో టాల్ స్టాయ్**
**బాలల కథలు నుండి**

శతకం


# వేమన పద్యాలు

**విద్యలేని వాడు విద్వాంసుల కడను**
**ఉండగానె పండితుడు గాడు**
**కొలని హంసలకడ కొక్కెర యున్నట్లు**
**విశ్వదాభిరామ వినురవేమ!**

తాత్పర్యం : పండితుల వద్ద ఉన్నంత మాత్రాన చదువులేని వాడు పండితుడు కాలేడు. హంసలతో కలిసినంత మాత్రాన కొంగకి గుర్తింపు రాదు.

**అంతరంగమందు నభవు నుద్దేశించి**
**నిలిపి చూడఁదలఁపు నిలుచుఁగాక**
**బాహ్యమందు శివుని భావింప నిలుచునా**
**విశ్వదాభిరామ వినురవేమ!**

తాత్పర్యం : పైకి మంచివాడిగా నటిస్తూ మనస్సులో చెడుగా ఆలోచించే మనిషి గురించి ఇతరులకు తెలియక పోవచ్చు గాని, దేవుడికి తెలియకుండా ఉంటుందా?



# ఊరితో స్నేహం


శెట్టిపాలెం గ్రామం అంటే నాకెంతో ఇష్టం. ఆ ఊరే నాకు స్నేహితురాలు. ఆ ఊరిలోని చెట్లు, దేవాలయాలు, ఊరి పక్క చెరువు, బావులు వీటన్నింటితో నాకు ఎంతో అనుబంధం ఉంది. ఆ ఊరిలోని గ్రామస్తులు కూడా నాకు మిత్రులే. అక్కడి చెరువు అంటే నాకు ఎంతో ఇష్టం. అక్కడి తోటలు, పొలాలు, బడి నన్ను ఎంతగానో ఆకట్టుకుంటాయి. మామిడి తోటలో పండ్లు దొంగిలించడం వంటి చిలిపి పనులు నాకు ఎంతో ఇష్టం. అక్కడి ప్రకృతిని చూసి పరవశించి పోతాను. మా ఊర్లోని గ్రంథాలయంలోని పుస్తకాలు, పుస్తకాల్లోని కథలు నాకు చాలా ఇష్టం. చెరువులో తామర పూలు, చెంగున ఎగరే చాప పిల్లలు, చెరువు ఒడ్డున తాబేలు, చెరువులో కొంగలు చెట్లపై పక్షులు ఎంత చూసినా తనివి తీరదు. చెరువులో చాకలి వాళ్ళు బట్టలు ఉతకడం, రైతులు పశువులను కడగడం, పిల్లలు చెరువులో ఈత కొట్టడం వంటి అందమైన దృశ్యాలు నాకు చాలా ఇష్టం. పక్షుల కిలకిల రావాలు, అందమైన ప్రకృతి శోభ, పండుగ రోజులలో జరిపే జాతరలు, మంచి చెడులకు తోడుగా ఉండే గ్రామీయులు గ్రామం అంటే నాకు బాగా ఇష్టం ఏర్పరిచాయి. అందుకే ఊరే నా ప్రాణ స్నేహితురాలు.

– కె. మేఘన

పదవ తరగతి (ఇంగ్లీష్ మీడియం) జెడ్‌పిహెచ్ (గర్ల్స్), మిర్యాలగూడ, నల్గొండ,
m : 91 99591 26682



# బచ్చాలాట



ఎంతమంది పాల్గొనవచ్చు –
ఇద్దరు నుంచి పది మంది వరకు
ఎక్కడ ఆడవచ్చు – ఆరు బయట స్థలం
ఈ ఆటకు గల ఇతర పేర్లు –
పత్తాలు, పత్తాలాట, ఓకులాట, లింగోచ్

'బచ్చాలాట'కు ఆటకు కావలసిన వస్తువులు పాత సిగరెట్ పెట్టెలు, వాటి లోపల ఉండే కాగితములు.

అందరిని అలరించేది బచ్చాలాట. ఆటగాళ్ళు ఒక వృత్తాకారపు గీత గీసి దాని మధ్యలో సిగరెట్ పెట్టెల అట్టలను, ఒకదాని పైన ఒకటి దొంతరగా పెట్టి, అలా పేర్చిన తరువాత వాటిని చదునుగా వుండే నాప రాయి ముక్కతో ఆ దొంతరను పడగొట్టి, బరిలోంచి బయటకు వచ్చేట్లు చేయాలి. అలా కొట్టినప్పుడు ఎన్ని సిగరెట్ పెట్టెలు బరి బయటకు వస్తాయో అవి ఆటగాడికి చెందుతాయి.

ప్రతి సిగరెట్ పెట్టెకు కొంత విలువ ఉంటుంది. ఉదాహరణకు: గోల్డ్ ఫ్లేక్ సిగరెట్టు పెట్టె ఉపరితల కాగితపు విలువ 5. అలాగే ఏ రకమైన సిగరెట్టు పెట్టె లోపలి కాగితపు విలువ 1గా లెక్కిస్తారు.

దూరపు ప్రాంతాల నుండి ఎవరైనా చుట్టాలు వచ్చినప్పుడు వారు తమ సిగిరెట్టు ప్యాకెట్ ఎప్పుడు క్రింద పడేస్తారా అని పిల్లలు ఎదురు చూస్తూ ఉంటారు. సాధారణముగా, కొన్ని ప్రాంతాలలో దొరికే సిగిరెట్టు పెట్టెలు అన్ని చోట్లా దొరకవు. అలా ఏదైనా కొత్త ప్యాకెట్టు, పిల్లలకు దొరికితే, వారికి పండగే! సిగరెట్టు పెట్టెలు లేకపోయినా, దళసరి అట్ట ముక్కల మీద చిత్రాలు గీసి వాటితో కూడా ఆడుకోవచ్చు.

**ప్రయోజనం:** ఈ ఆట వల్ల ప్రాథమిక గణిత పరిజ్ఞానం వస్తుంది. మరియు చేతి బల నిరూపణకు, లాఘవానికీ తోడ్పడుతుంది.

– 'చిన్ననాటి ఆటలు–జ్ఞాపకాల మూటలు' నుండి...



# సైలెంట్ ఆర్కిటెక్ట్ ఆఫ్ ఇండియా @ డా॥ మన్మోహన్ సింగ్

హాయ్ ఫ్రెండ్స్! ఎలా ఉన్నారు? బాగున్నారా!

సాధారణంగా ఒక కుటుంబం స్థాయికి మించి అప్పులు చేసినప్పుడు దాన్ని తీర్చుకోవడానికి ఎన్ని అవస్థలు పడుతూ ఉంటుందో మనం చూస్తూ ఉంటాము. అలాంటిది ఒక దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభానికి గురైనప్పుడు ఇంకెన్ని కష్టాలు పడుతుందో మనం ఊహించుకోవచ్చు.

90వ దశకంలో మన దేశం కూడా ఆర్థికంగా అలాంటి సంకట స్థితినే ఎదుర్కొంది. ఆ సంక్షోభ స్థితి నుండి గట్టెక్కడానికి మన దేశ బంగారం ఐ.ఎమ్.ఎఫ్. దగ్గర తాకట్టు పెట్టాల్సి వచ్చింది. ఇలా ఏ వైపు చూసినా పరిష్కారం కానరాని స్థితిలో కారు చీకట్లో కాంతి రేఖలా ఓ దార్శనికుడు మన దేశానికి ఆర్థిక మంత్రియై (తరువాత ప్రధాన మంత్రి కూడా అయ్యారు) మన దేశాన్ని ఆ చిక్కు సమస్యల నుండి గట్టెక్కించాడు. ఆ దార్శనికుడు ఎవరో కాదు మన మాజీ ప్రధాన మంత్రి డా॥ మన్మోహన్ సింగ్. ఆయన జీవిత విశేషాలను మనం కూడా తెలుసుకుందామా ఫ్రెండ్స్!!

### జననం:

మన్మోహన్ సింగ్ గారు 1932 సెప్టెంబర్ 26న బ్రిటీష్ ఇండియాలో పంజాబ్ రాష్ట్రంలోని గహ్ గ్రామంలో జన్మించారు. ఇప్పుడు ఇది పాకిస్తాన్‌లో ఉంది. గురుముఖ్ సింగ్ కోహ్లి మరియు అమ్రిత్‌కౌర్ వీరి తల్లిదండ్రులు. దేశ విభజన అనంతరం వీరి కుటుంబం పాకిస్తాన్ నుండి భారత్‌కు వలస వచ్చింది.

### విద్యాభ్యాసం :

1948లో మన్మోహన్ సింగ్ గారు అమృత్‌సర్‌లోని హిందూ కళాశాలలో చదువుకున్నారు. తరువాత ఆయన పంజాబ్‌లోని హోషియాపూర్‌లో ఆర్థిక శాస్త్రం చదువుకున్నారు. 1954లో పీజీ చేశారు. సింగ్ చదువు పంజాబ్ నుండి బ్రిటన్ కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి మారింది. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో ఎకనామిక్స్‌లో ఫస్ట్ క్లాస్ ఆనర్స్ డిగ్రీని తీసుకున్నారు. తరువాత ఆయన ఎన్నో డిగ్రీలను, డాక్టరేట్లను పొందారు. ఇలా మన్మోహన్ సింగ్ తన విద్యా జీవితపర్యంతం మొదటి స్థానంలో రాణించారు.

### ఉద్యోగ నిర్వహణ :

1969 నుండి 71 వరకూ ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ఇంటర్ నేషనల్ కామర్స్ ప్రొఫెసర్‌గా పని చేశారు. 1972లో సింగ్ ఆర్థిక మంత్రిత్వ శాఖలో ముఖ్య ఆర్థిక సలహాదారుగా నియమితులయ్యారు. 1976లో ఆర్థిక మంత్రిత్వ శాఖలో కార్యదర్శిగా పని చేశారు. 1982 నుండి 1985 వరకు రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా గవర్నర్‌గా పని చేశారు. ఇలా ప్రభుత్వంలో పలురకాల పదవులలో సింగ్ సేవలందించారు.

1991లో ప్రధానిగా పి.వీ. నరసింహారావు బాధ్యతలు చేపట్టారు. అప్పటికి భారతదేశం చెల్లింపుల లోటు కారణంగా తీవ్ర ఆర్థిక సంక్షోభానికి గురైంది. భారత ప్రభుత్వం ఐఎంఎఫ్ దగ్గర బంగారం తనఖా పెట్టి డబ్బులు తెచ్చింది. అప్పటి పరిస్థితులకనుగుణంగా ప్రధాని పి.వీ. నరసింహారావు గారు మన్మోహన్ సింగ్ గారిని ఆర్థిక మంత్రిగా నియమించారు. 1991 జూన్ 21 నుండి 1996 మే 16 వరకు సింగ్ ఆర్థిక మంత్రిగా తన సేవలను అందించారు. 2004 –

2014 వరకు సింగ్ కాంగ్రెస్ పార్టీ తరఫున భారతదేశానికి ప్రధాన మంత్రిగా తన సేవలందించారు. 1991 నుండి 2024 వరకు మన దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు.

## సంస్కరణలు


* 1991లో మన దేశం తీవ్ర ఆరిక సంక్షోభానికి గురైనప్పుడు మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా జులై 24, 1991లో నూతన ఆర్థిక విధానాన్ని ప్రవేశపెట్టారు.
* అదే 1991లోనే సింగ్, ఆర్థిక మంత్రిగా దశాబ్దాలుగా భారత ఆర్థిక వ్యవస్థలో మందకొంణి ఆర్థిక వృద్ధి మరియు అవినీతికి మూలం అయిన 'లైసెన్స్ రాజ్', 'విధానాన్ని రద్దు చేసి భారత ఆర్థిక వ్యవస్థను సరళీకృతం చేశారు.
* తాను ప్రధాని అయ్యాక కూడా అవే ఆర్థిక సంస్కరణలను కొనసాగించారు.
* ఆర్థిక మంత్రి చిదంబంతో కలిసి 8 నుండి 9 శాతం ఆర్థిక వృద్ధి రేటును సాధించారు. ఆయన హయాంలోనే జి.డి.పి. వృద్ధి 9 శాతానికి ఎగబాకింది.
* అదే విధంగా ఉపాధి హామీ పథకానికి శ్రీకారం చుట్టారు.
* ఆయన పాలన కాలంలోనే దేశంలో 3జీ, 4 జీ సేవల ప్రారంభంతో మొబైల్ సాంకేతిక విప్లవం ఊపందుకుంది.
* వీరి హయాంలోనే ఆధార్ కార్డుల జారీ మొదలైంది.
* వివిధ పథకాల కింద నగదు సాయాన్ని, ఆధార్ అనుసంధానమైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా బదిలీ చేసే డిబీటీ అను ప్రక్రియను ప్రారంభించింది.
* సామాన్యుడి చేతికి పాశుపతాస్త్రం లాంటి సమాచార హక్కును అందించింది వీరి ప్రభుత్వమే.
* జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్.ఐ.ఏ.) ఆయన హయాంలోనే అవతరించింది.
* దేశంలో 3 కోట్ల మంది చిన్న సన్నకారు రైతులకు రూ 72 వేల కోట్లు రుణమాఫీ చేసిన ఘనత మన్మోహన్ ప్రభుత్వానికి దక్కుతుంది.
* మన్మోహన్ హయాంలోనే విదర్భ, బందేల్‌ఖండ్ ప్రాంతాల్లో రైతు ఆత్మహత్యలు నివారణ కోసం ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటించారు.
* ఆయన హయాంలోనే తెలంగాణ అవతరించింది.
* ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం కూడా ఆయన హయాంలోనే రూపుదిద్దుకుంది.
* మన్మోహన్ హయాంలోనే ప్రతిభాపాటిల్ మొదటి మహిళా రాష్ట్రపతి అయ్యారు.
* సేల్స్ ట్యాక్స్ స్థానంలో వ్యాట్‌ను ప్రవేశపెట్టారు.
* జి.ఎస్.టి. విధానాన్ని తెర మీదకు తెచ్చింది మన్మోహన్ ప్రభుత్వమే.
* సింగ్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో వైద్య మౌలిక వసతులు పెంపొందించడానికి నేషనల్ రూరల్ హెల్త్ మిషన్‌ను ప్రారంభించింది.
* పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగు పరచడానికి జవహర్‌లాల్ నెహ్రూ అర్బన్ రెన్యువల్ మిషన్‌ను ప్రారంభించింది.

## పురస్కారాలు

తను అందించిన విప్లవాత్మక, ప్రజానుకూల పరిపాలన విధానాలతో డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎన్నో అవార్డులు, పురస్కారాలు అందుకున్నారు. భారతదేశంలో అత్యున్నత పౌర పురస్కారాల్లో రెండవది అయిన, పద్మవిభూషణ్ పొందారు. యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్ మరియు ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం సహా అనేక యూనివర్సిటీల నుండి గౌరవ డాక్టరేట్లు పొందారు.

మనం కూడా డా॥ మన్మోహన్ సింగ్ గారిని, ఆదర్శంగా తీసుకుని మన దేశానికి వెలకట్టలేని సేవలు అందించాలి. ఓకే నా ఫ్రెండ్స్... ఉంటాను మరి....! బై బై!!

– ఎన్. అక్షయ
9వ తరగతి
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రావులకొలను,
సింహాద్రిపురం మండలం, కడప జిల్లా.
m : 9550290047






# తెలంగాణ - చారిత్రక పర్యాటకం

**రాతిగుహలు - చిత్రాలు**

ఆదిమ మానవుడు దేశ సంచారి. ఒకే ప్రదేశంలో నివసించే వాడు కాదు. కొండల్లో, అడవులలో, రాతిగుహలలో నివసించే వాడు. అడవుల్లో లభించే పండ్లు, కాయలు, జంతువుల మాంసం తింటూ జీవించేవాడు. ఆహారం దొరక్కపోతే మరో ప్రాంతానికి వలస వెళ్ళేవాడు. జంతువులను వేటాడటానికి రాతి పరికరాలు తయారు చేసుకున్నాడు. ఆలోచనాశక్తి అలవరుచు కున్నాడు. రాయిని ఉపయోగించి నిప్పును తయారు చేయడం తెలుసుకున్నాడు. కర్రతో చేసిన పాత్రలను ఉపయోగించుకున్నాడు. అలా వేటాడి తెచ్చుకున్న ఆహారాన్ని నిల్వచేసుకోవడం అలవాటు చేసుకున్నాడు. పలు జంతువులను మచ్చిక చేసుకున్నాడు. పశు పోషణ, వ్యవసాయం చేసి ధాన్యాలను నిల్వ చేసుకున్నాడు. ఇక నిరంతరం ఆహార సేకరణకు పోవాల్సిన అవసరం లేకపోవడంతో, దొరికిన ఖాళీ సమయంలో వారిలో ఆలోచనా వికాసం జరిగింది. సృజనాత్మకత పెరిగి తీరిక సమయాల్లో తాను నివసిస్తున్న గుహలోపలి గోడలపై, కప్పుపై భాగంపై, రాతి ఎత్తు పల్లాలలో తాను నివసిస్తున్న ప్రాంతంలోని జంతువులను పరిసరాలను, గీతలుగా, బొమ్మలుగా చిత్రించడం ప్రారంభించాడు. చిత్రాలు గీయడానికి ప్రకృతి సిద్ధంగా లభించే ఎరుపు, తెలుపు, పసుపు రాళ్లను, కర్ర బొగ్గును వాడి చిత్రాలు గీసేవాడు. ఈ చిత్రాలు ముఖ్యంగా వేటాడే దృశ్యాలు, కత్తి, డాలు, ధనస్సు బాణం, బల్లెం, మొదలైన ఆయుధాలు పట్టుకొని, గుర్రాన్ని ఏనుగులను స్వారీ చేస్తున్న మనుషులు, కుక్క, ఎద్దు, జింకలు, పక్షులు, చేపలు, పులులు, కుందేలు, నక్క, తాబేలు, ఎంద్రుకాయలు మొదలైన చిత్రాలు, కొత్త రాతియుగము నుండి తొలి చారిత్రక యుగము వరకు వివిధ కాలములకు చెందిన రాతిచిత్రాలు మనకు తెలంగాణ ప్రాంతంలో సుమారుగా అన్ని జిల్లాలలో చరిత్రకారుల, పరిశోధకుల అన్వేషణలో ఆదిమ మానవుని రాతి చిత్రాలు కొండగుహల్లో గొప్ప వారసత్వ సంపదగా గుర్తింపుకు నోచుకున్నవి. ఇంకా కొత్త కొత్త రాతి చిత్ర స్థలాలు వెలుగులోకి వస్తున్నాయి.

ఇప్పటి వరకు సుమారుగా 100 కు పై రాతిచిత్ర స్థావరాలు మనకు తెలంగాణా వ్యాప్తంగా వెలుగు చూసాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రావులపల్లి పరిసరాల్లో తిరుమలగిరి గ్రామంలో దాదాపు 2 వేల ఎకరాల్లో విస్తరించి ఉన్న పాండవుల గుట్టలు, సున్నపురాయి గుట్టల్లో కొన్ని శతాబ్దాలుగా మరుగున పడి ఉన్న కొత్త రాతియుగం నుండి చారిత్రక తొలి యుగం మధ్య కాలంలో వేసిన రాతి చిత్రాలున్నాయి. ఈ చిత్రాలన్నీ ముదురు ఎరుపు రంగుతో గీయబడ్డాయి. అవి మనుషులు, జంతువులు, జింకలు, చేపలు, మేకలు, కుక్కలు, ముళ్లపందులు, కుందేళ్ళు, తాబేళ్ళు, పాములు, చిలకలు, సీతాకొక చిలుకలు, కొండింగ, నెమలి, కప్ప, బల్లి, ఎలుగుబంటి, పెద్ద పులులు, అంతేకాక వలపట్టుకున్న మనుషులు, కుందేళ్లను తరముతున్న కుక్కలు, ఈనిన జింక, జింకపిల్లను నాకుతున్న దృశ్యాన్ని చూస్తున్న మనిషి, త్రిభుజాలు, త్రిశూలం, చక్రం, చుక్కల వంటి రేఖాకృతులు, మరికొన్ని శిథిల చిత్రాలు ఉన్నాయి. 12, 13 శతాబ్దాల నాటివిగా భావిస్తున్న పాండవులు, ద్రౌపతి, వివిధ దేవతా రూపాల చిత్రాలున్నాయి. అంతేకాకుండా, కోసెగుట్ట, బొమ్మలలొద్ది - ములుగు జిల్లా, దేవర్ల గుట్ట, జయశంకర్ భూపాలపల్లి జిల్లా, అక్కమహాదేవి గుహలు - నాగర్ కర్నూల్, దుపాడుగుట, సంగవోనిపల్లి, నారాయణపేట, ముడుమాల, పోలూన్‌పల్లి - మహబూబ్‌నగర్, శివారు వెంకటాపుర్-మెదక్, వర్గల్-సిద్ధిపేట, కోకపేట-రంగారెడ్డి, గాంధారికోట-ఆదిలాబాద్, రామచంద్రాపురం, అక్షరలొద్ది-ఖమ్మం, రాచకొండ-నల్గొండ తదితర జిల్లాలో రాతిచిత్రాల గుహలు మనం ముఖ్యంగా చెప్పుకోవచ్చును. ఇక ప్రత్యేకంగా తెంగాణ రాతి చిత్రాల ప్రయోగశాలగా చెప్పుకునే పాండవుల గుహలకు పర్యాటక వసతులు కల్పించి, అందరికి అందుబాటులోకి తెస్తే, ప్రపంచ పర్యాటక వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందే అవకాశం కూడా ఉంది.

- దేశరాజు శ్యాంసుందర్‌రావు - స్థపతి
m : 9010051177

# కల్పనా చావ్లా ఏరో ఇంజనీరింగ్ చదువు ఓ పోరాటం!

కల్పనా చావ్లా అనే పేరు మీరు వినే ఉంటారు. ఎంతో మందికి అమితమైన స్ఫూర్తి కలిగించిన యువతి ఈమె. 1962 మార్చి 17న జన్మించిన కల్పన అంతరిక్షంలోకి దూసుకు వెళ్లిన తొలి భారతీయ మహిళ. ఆమె జీవిత విశేషాలు ఆద్యంతం ఆసక్తిని కలిగిస్తాయి. ఏరోస్పేస్ ఇంజనీరింగ్ చదవాలనే ఆమె పట్టుదల ఎంత ముచ్చట కలిగిస్తుందో, 2003 ఫిబ్రవరి 1న అర్ధంతరంగా అంతరిక్షంలో 40 ఏళ్ల వయసులో కనుమూయడం కూడా అంతే విషాదాన్ని కలిగిస్తుంది. 1947లో దేశవిభజన జరిగినప్పుడు భారతదేశానికి తరలివచ్చిన కుటుంబ నేపథ్యం ఈమెది. హర్యానాలోని కర్నాల్‌లో కల్పన తండ్రి బనార్సిలాల్ చావ్లా టైర్లు తయారు చేసే ఫ్యాక్టరీ కలిగి ఉండేవారు. కల్పనతో పాటు సునీత, దీప, సంజయ్ అనే మరో ముగ్గురు చావ్లా సంతానం.



1976లో కల్పన 12 తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణురాలు కాగానే తండ్రి కూతురును టీచర్ గానో, డాక్టర్ గానో కావాలని ఆశించారు. కానీ కల్పన దృష్టి అంతా అంతరిక్షం వైపే ఉంది. తండ్రి మాత్రం అది అబ్బాయిలు చదువుకునే కోర్సు కదా అని కుదరదన్నాడు. కల్పన ఆ నిర్ణయాన్ని ససేమిరా కాదని, ఏరో ఇంజనీరింగ్ తన కల అని మొండికేసింది. అయితే తల్లి మాత్రం ఎప్పుడూ కల్పన వైపే ఉండేది. దానితో తండ్రి కూడా విధిలేక పంజాబ్ ఇంజనీరింగ్ కళాశాలలో కల్పనా చావ్లాను చేర్పించారు. కళాశాలలో కౌన్సిలింగ్ సమయంలో ఈమె ఏరో నాటికల్ ఇంజనీరింగ్ కోర్సును ఆప్షన్‌గా ఎంచుకుంది. అయితే అక్కడున్న సిబ్బంది ఎలాగైనా కల్పనను ఆ కోర్సు తీసుకోకుండా తప్పించాలని శతవిధాలా ప్రయత్నం చేశారు. రెండవ ఆప్షన్ ఏమిటని అడిగితే ఏదీ లేదు అని పదేపదే చెప్పారు.

అలా ఏరోనాటికల్ ఇంజనీరింగ్‌లో చేరిన తొలి మహిళ కల్పన. ఆమె తప్పా మరే యువతి అక్కడ ఆ కోర్సు చదవడం లేదు. ఎంతో పట్టుదలతో ఉన్న కల్పన చావ్లా అక్కడ గర్ల్స్ హాస్టల్ లేకపోయినా, ఉన్న ఒక్క ఇరుకు గదిలో సర్దుకుని ముందుకెళ్ళింది. సైకిల్ మీద ప్రతిరోజు కాలేజీకి వెళ్లి వచ్చేది. అంతేకాదు స్వీయరక్షణార్థం కరాటేని కూడా నేర్చుకున్నారు. ఆమెకు అయాన్ రాండ్, ఓరినా ఫలాసి, రిచెడ్ బ్యాచ్ వంటి రచయితలను చదవడం చాలా ఇష్టం. అలాగే ఆమెకు క్లాసిక్ రాక్ సంగీతం అంటే మితిమీరిన ఇష్టం. ఇంకా అబిదా పర్వీన్, నుస్రత్ ఫతే అలీ ఖాన్, రవిశంకర్, హరిప్రసాద్ చౌరాస్యా వంటి విద్వాంసుల సంగీతం అంటే కూడా చాలా అభిమానం. ఆమె కాలేజీ మ్యాగజైన్‌కు స్టూడెంట్ ఎడిటర్‌గా కూడా వ్యవహరించారు. అంతేకాదు కాలేజీలోని ఏరో క్లబ్, ఆస్ట్రో సొసైటీకి జాయింట్ సెక్రెటరీగా కూడా ఉన్నారు. కళాశాలలో చేరిన తొలి సంవత్సరమే యాన్యువల్ కాన్ఫరెన్స్‌లో ఐన్ స్టీన్ థియరీ ఆఫ్ రిలేటివిటి ఆధారంగా 'టైమ్ లాప్స్ ఇన్ స్పేస్' అనే పత్రాన్ని సమర్పించడం విశేషం.

1982లో ఆమె ఇంజనీరింగ్ డిగ్రీ తర్వాత టెక్సాస్ యూనివర్సిటీలో చేరి తన ఎం.ఎస్.సి.ని పూర్తి చేసింది. ఇలా చదువు తున్నప్పుడే పైలట్ జీన్ పియరి హారిసన్ కలవడం, తర్వాత వారు పెళ్లి చేసుకోవడం జరిగింది. పిమ్మట పీహెచ్‌డి కూడా 1988లో సాధించింది. 1997లో స్పేస్ షటల్ కొలంబియా 'ఎస్ టి ఎస్-87' లో అంతరిక్షంలోకి వెళ్లడంతో ఆమె అలా అంతరిక్షంలోకి వెళ్లిన తొలి భారతీయురాలుగా నమోదయింది. అయితే ఆమె రెండవ అంతరిక్ష ప్రయాణం 2003లో ఎస్.టి.ఎస్.-107లో వెళ్లారు. ఫిబ్రవరి ఒకటో తేదీన స్పేస్ షటిల్ కొలంబియా ఉద్దేశించిన పని పూర్తి చేసుకుని తిరిగి భూమి వైపు ప్రయాణిస్తున్న సమయంలో జరిగిన ప్రమాదంలో కల్పనా చావ్లా కనుమూశారు.

- డా. నాగసూరి వేణుగోపాల్
m : 9440732 392



# రంగుల కేళి హోళీ

తేజ: తాతయ్య నేనోటి అడగనా?! ఏమి అనుకోవు కదా?!

తాత: అనుకునేది ఏముంది? నేను ఉన్నదే నీకు తెలియని విషయాలు చెప్పడానికి కదా?

తేజ: అదే అనుకో కాని నువ్వు చెప్పే ఓపిక తీరుబడిగా ఉన్నావో లేదో అని అలా అన్నాను.

తాత: నీకోసం ఓపిక తీరుబడి తెచ్చుకోవాలిగా?!

తేజ: ఎంతైనా నువ్వు నా లవ్‌లీ గ్రాండ్ ఫా కదా!?

తాత: సరే పొగడ్తలు ఆపి నీ సందేహం ఏమిటో చెప్పు.

తేజ: మన తెలుగు వారి పండుగలు అన్నీ ప్రకృతి మార్పులతో సంబంధం కలిగి ఉంటాయి కదా?

తాత: తెలుగు పండుగలే కాదు. మన భారతీయ పండుగలు అన్నీ కూడా!! అంతే కాదు ప్రపంచంలో ఎవరికీ లేనన్ని ప్రకృతి సంబంధ పండుగలు మనకే ఉన్నాయి తెలుసా?

తేజ: ఔనా తాతయ్యా! మన పండుగలు ప్రకృతి సంబంధంతో పాటు ఖగోళ శాస్త్రం ప్రకారం సూర్యచంద్రులు, తిథులు, నక్షత్రాల గమనం స్థితిని బట్టి కూడా వస్తాయని మా సైన్స్ సార్ కూడా చెప్పారు.

తాత : అది సరే గాని మన తెలుగు వారి పండుగల్లో తొలి పండుగ చివరి పండుగ ఏదో తెలుసా.

తేజ: తొలి పండుగ ఉగాది అయితే చివరి పండు "హోళీ" దీనినే మన తెలుగు నెలల్లో 12వది చివరది అయిన ఫాల్గుణ మాసం పున్నమి నాడు జరుపుకుంటారు.

తేజ: దీనిని రంగుల పండగ అని కూడా అంటారు కదా? ఆ రోజు పొద్దునే అందరం రంగులు జల్లుకుంటాము కదా?

తాత: ఔను దీనిని గ్రీస్, ఈజిప్టు దేశాలలో కూడా జరుపుకుంటారు, ఇక మన దేశంలో అత్యంత వైభవంగా చేసుకుంటారు. ప్రాంతాలను బట్టి అనేక పేర్లతో పిలుస్తారు. ఫాల్గుణోత్సవం మన్మధ జయంతి, వసంతోత్సవం, ధులండీ, డోలోత్సవం, కాముని పున్నమి వంటి పేర్లతో.

తేజ: ఈ పండుగకు సంబంధించిన కథలు గాని ఆధారాలు గాని ఉన్నాయా తాతయ్య?

తాత: ఎందుకు లేవు ఈ హోళీ ఉత్సవం గురించి కాళిదాసు వ్రాసిన సంస్కృత కావ్యాలలో అనేక సందర్భాల్లో మధనోత్సవంగా వర్ణించాడు, సాహిత్యం కావ్యాలతో పాటు అనేక పురాణ గాథల్లో కూడా ఈ హోళీ పండుగ కామదహనం గురించి చెప్పబడింది. ఇది వసంత ఋతువు రాకను తెలిపే ప్రకృతి పండుగ కూడా!!

తేజ: అసలు ఆ హోళీ పండగ ఎందుకు జరుపుకోవాలి? పండుగలు అంటే కొత్త బట్టలు పిండి వంటలు ఉండాలి గాని ఈ పండుగ నాడు రంగులే ఎందుకు



జల్లుకోవాలి?

తాత: కామరూపంలో ఉన్న మన్మథుడిని సంహరించి నందుకు గుర్తుగా ఈ "కాముని పున్నమి" జరుపుకుంటారన్నది ప్రధాన కథనం.

తేజ: "మన్మథుడు" అంటే ఎవరు?

తాత: "కామం" అంటే కోరిక అని అర్థం. మనిషిలోని కోరికలు మితిమీరినప్పుడే సమాజంలోని క్రమశిక్షణ దెబ్బతింటుంది. ప్రతి మనిషి తనలోని కోరికలను దహింప చేసుకుని శారీరక, మానసిక, సామాజిక ఆరోగ్యాలతో తులతూగాలన్నదే ఈ పండుగ చేసుకోవడంలో అర్థం పరమార్థం.

తేజ: మనిషిలోని కామం అనే కోరికకు ప్రతి రూపం మన్మథుడా?!

తాత: వెరిగుడ్ బాగా అర్థం చేసుకున్నావు. మరో విషయం చెప్పడం మర్చిపోయా? తెలంగాణ ప్రాంతంలో ఈ కాముని పున్నమినే "జాజిరి పున్నమి" అని పిలుస్తూ పున్నమికి పది రోజులు ముందు నుంచి రోజు రాత్రి పూట గ్రామాల్లో తిరుగుతూ జానపద బాణీల్లో జాజిరి పాటలు పాడుతూ ఆనందంగా గడిపి ఆఖరి రోజు ఊరు చివర కాముడు అనే మన్మథుని బొమ్మ మంటల్లో తగలబెట్టి మరునాడు పొద్దున్నే రంగులు జల్లుకుని ఆనందంగా గడుపుతారు.

తేజ: ఔను తాత... పండగ నాడు రంగులే ఎందుకు జల్లుకోవాలి?

తాత: పాత ఏడాది ముగిసి మరో కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టబోతున్నామనే ఆనందంతోనే ఈ రంగులు చల్లుకునే అలవాటు ఆచారంగా వచ్చింది.

తేజ: అంటే పూర్వం నుంచి ఈ రంగులు ఉన్నామన్న మాట?

తాత: కాదు పూర్వం ఈ పండుగ నాడు రకరకాల పూలు ఒకరి పై ఒకరు చల్లుకునేవారు తరువాత కాలంలో పూలను నీళ్లల్లో కలిపి రంగు నీళ్ల తయారు చేసుకునే వారు. కాలక్రమేణా రంగుల తయారీలలో మార్పులొచ్చి ప్రకృతి స్థానంలో రసాయన రంగులు వచ్చి చేరాయి.

తేజ: అసలు రంగులు జల్లుకోవడంలో అంతరార్థం ఏమిటి?

తాత: ఏడాది అంతా పడ్డ శ్రమ మర్చిపోవడం ఒకరితో ఒకరు స్నేహభావంతో సత్‌సంబంధాలు పెంచుకోవడం, గతంలో కలిగిన మనస్పర్థలు గొడవలు మరిచిపోయి మళ్లీ కొత్త స్నేహ వాతావరణం పెంచుకోవడమే.

తేజ: బాగుంది తాతయ్య హోళీ అంటే కేవలం రంగులు జల్లుకోవడమే అనుకున్నా కాని ఇన్ని లాభాలు ఉన్నాయని ఇప్పుడే తెలిసింది.

తాత: నీకు చాలాసార్లు చెప్పాను పూర్వం మన పెద్దలు ఆచరించిన ఆచారాలు పాటించిన సాంప్రదాయాల్లో అనేక సామాజిక విలువలు లాభాలతోపాటు ఆరోగ్య విషయాలు దాగి ఉన్నాయని, కాని నేటితరం మీ యువక అతి స్వేచ్ఛతో వికృత వేషాలతో విలువైన సాంప్రదాయాలను పక్కదారి పట్టిస్తున్నారు. నేడు హోళీనాడు రసాయన రంగులు వాడుతూ శరీరానికి కోరి హాని తెచ్చుకుంటున్నారు.

తేజ : మేము మాత్రం ప్రకృతిపరమైన రంగులే వాడి, ఆనంద ఆరోగ్యాల హోళీ చేసుకుంటాము. బై తాతయ్య!

– డా. అమ్మిన శ్రీనివాసరాజు
m : 7729883223

✧ చెట్టు - చేమ

# తాటి చెట్టు







హాయ్ బాలలూ.. బాగున్నారా! ప్రతి నెల బాల చెలిమి సంచికలో బోలెడన్ని విషయాలు తెలుసుకుంటున్నాం కదా! ఈ మార్చి నెలలో పామే కుటుంబానికి చెందిన తాటి చెట్టు గురించి తెలుసుకుందాం.

తాటి చెట్టు అనగానే మనకు గుర్తుకొచ్చేది కల్లు. దీన్ని తాగని వారు సాధారణంగా ఉండరు. తాటి చెట్లు మెట్ట, ఏజెన్సీ, గుట్టల ప్రాంతాలలో ఎక్కడపడితే అక్కడ కనిపిస్తాయి. నీటి ఎద్దడిని తట్టుకుని పెరుగుతాయి. కొన్నేళ్ల క్రితం తాటి చెట్లను బీడు భూముల్లో, గేట్ల పొంటి రైతులు ఇష్టంగా పెంచేవారు. ఎండాకాలం వచ్చిందంటే చాలు ఒకప్పుడు కల్లు, తాటి ముంజలు, తాటి పండ్లు బాగా తినేవారు. ఇప్పటికీ తాటి ముంజలు తింటూనే ఉన్నారు. తాటి చెట్లు సాధారణంగా 50-60 అడుగుల వరకు పెరుగుతాయి. గింజలు నాటిన 10-12 సంవత్సరాలకు కాతకు, గీతకు వస్తాయి. ఎన్నో ఉపయోగాలు ఉండడంవల్ల తాటి చెట్టును “కల్పవృక్షం” అని అంటారు. ఒక్కొక్క తాటి చెట్టు సుమారుగా 6 గెలల నుండి 12 గెలలు వేస్తుంది. ఇందులో ఆడ, మగ అని రెండు రకాలు ఉంటాయి. ఆడ తాటి చెట్లను పరుపులు, మగ తాటి చెట్లను పోతులు అని అంటారు. మామూలుగా తాటికల్లు నవంబర్ డిసెంబర్ నెలలో మొదలై జులై ఆగస్టు వరకు దొరుకుతుంది. తాటి ముంజల నుండి పందాడు కల్లు కూడా గీస్తారు. గౌండ్ల కులం వారే కాకుండా అనేక కులాల వారు కూడా తాటి చెట్లు ఎక్కి కల్లు గీస్తారు. తాటి చెట్లు ముస్తాదు సహాయంతో పైకి ఎక్కుతారు. ఈ తాటి చెట్ల వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి.

**తాటి చెట్ల వల్ల ఉపయోగాలు :**

* తాటి చెట్ల నుండి లభించే కల్లు, నీరా తాగితే ఆరోగ్యానికి ఎంతో మంచిది. కళ్ళు సేవించడం వల్ల ఫ్లోరిన్ సమస్య కూడా పోతుంది.
* తాటి చెట్ల నుండి తాటి బెల్లం తీస్తారు. ఇందులో అనేక పోషకాలు పుష్కలంగా ఉంటాయి. తాటి బెల్లం తినడం వల్ల రక్తహీనత, కీళ్ల నొప్పులు, నెలసరి బాధలు తగ్గుతాయి. ఇందులో ఇనుము సమృద్ధిగా ఉండి హిమోగ్లోబిన్ పెంచుతుంది.
* తాటి ముంజలు తినడం వల్ల శరీరం చల్లబడుతుంది.
* తాటి కమ్మలు పేదవాళ్ల ఇండ్లకు, పశువుల కొట్టాలకు పైకప్పులకు బాగా ఉపయోగించేవారు.
* చాపలు, బుట్టలు, సంచులు, విసనకర్రలు, టోపీలు మొదలైనవి తాటి ఆకులతో తయారు చేస్తారు.
* ఎనకటి కాలంలో తాటికమ్మ తల పైన కప్పుకుని వర్షం నుండి గొడుగుగా ఉపయోగించేవారు.
* పూర్వ కాలంలో తాటి ఆకులను రాతప్రతులుగా ఉపయోగించేవారు.
* తాడిచెట్టు కాండంతో ఇంటికి దూలాలుగా, వాసాలుగా ప్రజలు ఉపయోగించేవారు. తాటి చెట్టు మట్టలతో తాటి నార చీరి తాళ్ళు పేనేవారు. తాటి చెట్టు గెలల నుండి పరకలతో పొరకలు కూడా తయారు చేస్తారు.

ఇట్లా అనేక రకాలుగా ఉపయోగపడుతున్న తాటి చెట్లు కనుమరుగవుతున్నాయి. భూమి సేద్యం పెరగడం వల్ల తాటి వనాల సంఖ్య రాను రాను తగ్గిపోతుంది. కల్లు గీసే వారు కూడా తగ్గిపోతున్నారు. పర్యావరణ పరంగా మానవాళికి ఎంతో మేలు చేసే తాటి చెట్లను కాపాడుకుందాం.

- కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
m : 9441561655



# చెలిమి

కుక్క, పిల్లి బద్ధ శత్రువులు
పెంపుడువైతే చేస్తయి చెలిమి
దయ కలిగితే శునకం పాలు
పిల్లి పిల్లలకు ఇస్తయి కలిమి



రావి, వేపలవి వేరే గుణాలు
కలిసి పెరుగుతాయి ఆకాశానికి
తీగ పాకితే ఇస్తయి స్థలాలు
కలిసి మొక్కుతాయి గుడి దేవునికి

మట్టిలో ఎన్నో రకాలుంటయి
నలుపు ఎరుపు రంగులుంటయి
కలిస్తే పంటకు బలాన్నిస్తయి
చెలిమికి అర్థం చేవే అంటయి



కలిసి పారుతాయి చీమలు
కలిసి ఎగురుతాయి పక్షులు
కలిసి బతుకుతాయి పావురాలు
కలిసుంటారా నిజంగా మనుషులు



చెలిమికి అర్థాలెన్నో చెప్తది ప్రకృతి
తెలిసి తెలివి మీరితే వికృతి
కలిసుండాల్సిన చోట విడాకులు
ఎవరి స్వార్థమే వారికి బాకులు



- కొమురవెల్లి అంజయ్య
సిద్దిపేట
m : 98480 05676



# పదిలో జాగ్రత్త

మార్చిలో రెండు తెలుగు రాష్ట్రాలలో 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఏడాది పొడవునా చదివిన విద్యార్థులకు, వారి భవిష్యత్తు మీద కొండంత ఆశ పెట్టుకున్న తల్లిదండ్రులకు కీలక సమయం ఆసన్నమైంది. రాసే పరీక్షలు విద్యార్థుల భవితవ్యాన్ని తేల్చనున్నాయి. పరీక్షలు దగ్గర పడుతున్న కొద్దీ విద్యార్థుల్లో ఒత్తిడి పెరిగిపోతూ ఉంటుంది. కొంత మేరకు ఒత్తిడి కూడా ఉపయోగ పడుతుంది. అయితే ఎట్టి పరిస్థితులలో అనవసరమైన ఒత్తిడికి గురి కాకూడదు. పరీక్షల సన్నద్ధత సమయంలో కొన్ని మెళకువలను తప్పని సరిగా తెలుసుకోవాలి.


ఇప్పటికే చాలా పాఠశాలల్లో సిలబస్ పూర్తయినందున 80 శాతం సమయం పునఃశ్చరణకు, మిగిలిన 20 శాతం సమయం కొత్త అంశాలు నేర్చుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. రోజంతా ఒకే సబ్జెక్టును చదవకుండా వివిధ సబ్జెక్టులు నేర్చుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వాలి. పరీక్షల సమయంలో ఆహారము, నిద్ర, వ్యాయామానికి తగిన ప్రాధాన్యతనిస్తుండాలి. ప్రతిరోజు ఒకే సమయానికి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం అలవాటు చేసుకోవాలి. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి. తాజాపండ్లు, డ్రై ఫ్రూట్స్, పాలు వంటి ఆరోగ్యకరమైన ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వాలి. నిద్రకు ఖచ్చితంగా 7 నుంచి 8 గంటల సమయం కేటాయించాలి. ఒక గంట సమయం చదివిన తరువాత మెదడుకు 5 నిమిషాలు విరామం ఇవ్వడం ద్వారా తిరిగి ఉత్సాహంతో చదవగలుగుతారు. కొద్దిసేపు సూర్య కాంతిలో నడక, పచ్చని మొక్కల మధ్య నడవడం లాంటివి చేయాలి. టీవీ, మొబైల్స్, సోషల్ మీడియాకు కొంత కాలం దూరంగా ఉండాలి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో సోషల్ సబ్జెక్టు సిలబస్ ఎక్కువగా ఉందని విద్యా రంగ నిపుణులు అంటున్నారు. కాబట్టి గణితం, ఇంగ్లీష్‌లతో పాటు సాంఘిక శాస్త్రంపై కూడా విద్యార్థులు ఎక్కువగా దృష్టి పెట్టాలి.

పరీక్షల సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరుల మీద ఆధార పడకూడదు. ఒకరితో పోల్చుకుంటూ చదవడం అసలు చేయరాదు. పరీక్షకు సంబంధించిన ముఖ్యమైన అంశాలను నోటు పుస్తకంలో రాసుకోవాలి. పూర్తయిన వాటిని ఎప్పటికప్పుడు టిక్ చేసుకుంటూ ఉంటే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ప్రతి సబ్జెక్టుకు కనీసం 5 మోడల్ ప్రశ్న పత్రాలను ప్రిపేర్ కావడం చేయాలి. సందేహాలను ఉపాధ్యాయులు, తోటి స్నేహితుల ద్వారా ఎప్పటికప్పుడు తీర్చుకోవాలి. బొమ్మలు, మ్యాపుల ద్వారా ఎక్కువ మార్కులు పొందవచ్చు. ఈ జాగ్రత్తలు పాటిస్తూ పరీక్షలు రాస్తే మంచి మార్కులు పొందవచ్చు. అదే విధంగా అనవసరమైన ఆకర్షణలకు దూరంగా ఉండాలి. వివాదాలకు దూరంగా ఉండాలి. పరీక్షా కేంద్రాల గురించి ముందే తగిన సమాచారం తీసుకోవాలి. ఉపాధ్యాయుల పట్ల సానుకూలంగా వుండాలి. పరీక్ష అంటే జీవితానికి అగ్ని పరీక్ష కాదు. ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదని నిరుత్సాహ పడకుండా మన ప్రయత్నాన్ని కొనసాగించాలి.

- యం.రాం ప్రదీప్
జెవివి సభ్యులు, తిరువూరు
m : 9492712836

రచన : కె. ఉషారెడ్డి

జనవరి 1991, బాలచెలిమి మాసపత్రిక నుండి...



# ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో కోహ్లీ సెంచరీ... పాకిస్తాన్ పై టీం ఇండియా ఘన విజయం!




దుబాయ్ వేదికగా ఆదివారం, ఫిబ్రవరి 23, 2025 జరిగిన మ్యాచ్‌లో పాకిస్తాన్‌పై టీమిండియా ఘన విజయం సాధించింది. ఆరు వికెట్ల తేడాతో పాకిస్తాన్‌ను ఓడించింది. కోహ్లీ విజయవంతంగా సెంచరీ పూర్తి చేశాడు. వన్డేల్లో విరాట్ కోహ్లీకి ఇది 51వ శతకం (ఓవరాల్‌గా 82వ శతకం). భారత్ 42.3 ఓవర్లలో 4 వికెట్లకు 244 పరుగులు చేసి గెలుపొందింది. విరాట్ కోహ్లీ (111 బంతుల్లో 7 ఫోర్లతో 100 నాటౌట్), శ్రేయస్ అయ్యర్ (67 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 56) హాఫ్ సెంచరీతో రాణించాడు. శుభ్‌మన్ గిల్(52 బంతుల్లో 7 ఫోర్లతో 46), రోహిత్ శర్మ (15 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 20), హార్దిక్ (8) పరుగులు రాబట్టారు.

ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 49.4 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌట్ అయింది. సౌద్ షకీల్(76 బంతుల్లో 5 ఫోర్లతో 62) హాఫ్ సెంచరీతో రాణించగా.. మహమ్మద్ రిజ్వాన్(77 బంతుల్లో 3 ఫోర్లతో 46), కుష్దిల్ షా(39 బంతుల్లో 2 సిక్స్‌లతో 38). అంతర్జాతీయ వన్డేల్లో అత్యంత వేగంగా 14 వేల పరుగుల మైలురాయి అందుకున్న తొలి బ్యాటర్‌గా టీమిండియా స్టార్ విరాట్ కోహ్లీ చరిత్ర సృష్టించాడు. క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ ఆల్‌టైమ్ వరల్డ్ రికార్డ్‌ను కోహ్లీ అధిగమించాడు. సచిన్ టెండూల్కర్ 350 ఇన్నింగ్స్‌ల్లో 14 వేల పరుగుల మైలురాయి అందుకుంటే కోహ్లీ 287 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ ఫీట్ సాధించాడు. సచిన్ టెండూల్కర్ (18426) టాప్‌లో ఉండగా.. కుమార సంగక్కర (14234), విరాట్ కోహ్లీ (14007) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఈ గెలుపుతో గ్రూప్-ఏ నుంచి టీమిండియా సెమీస్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. పాకిస్థాన్ సెమీస్ రేసు నుంచి తప్పుకుంది.

– సచిన్ కోత్వాల్

బాలచెలిమి, m: 9701001036



# ఇంటిలో గూడు – దానికి మేము తోడు వేసవి దాహాన్ని తీర్చుదాం

ఒకప్పుడు పిచ్చుకలు ఇళ్లల్లో స్వేచ్ఛగా గూళ్ళను నిర్మించుకొని మనిషితో సహజీవనం చేసేవి. మనుషులే అర్థం చేసుకొని వాటికోసం ఇళ్లల్లో జొన్న కంకులను సజ్జ కంకులను వేలాడదీసేవారు. నేడు పట్టణాలతో పాటు పల్లెల్లో కూడా పిచ్చుకల కిలకిల రావాలు వినిపించడం తగ్గి పోయాయి. దీనికంతటికి కారణం పర్యావరణ స్పృహ లోపించడం. మనుషులు జీవకారుణ్యంతో పశువులకు పక్షులకు మేలు చేసేందుకు పూనుకోవాలి. వేసవిలో దాహార్తితో అల్లాడిపోయి మూగజీవాల కోసం పశుపక్షుల కోసం మనమే అర్థం చేసుకుని అందుబాటులో తాగేందుకు చిన్న చిన్న పాత్రల్లో నీటిని ఉంచాల్సిన అవసరం ఉంది. ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి సంరక్షిస్తే పక్షులకు ఆశ్రయం కల్పించినట్లవుతుంది. మా ఇంటి వద్ద పిచ్చుకల కోసం అట్ట డబ్బాతో గూళ్ళు తయారుచేసి గోడకు బిగించాను. మొదట అందులో గూడు పెట్టేందుకు భయపడ్డా తర్వాత అవి తమ ఆవాసాలుగా మార్చుకున్నాయి. పిచ్చుకల కోలాహలంతో మనసు ఎంత ప్రశాంతంగా ఉంటుంది.

– గుముడాల చక్రవర్తి గౌడ్
మహబూబ్ నగర్
m: 9441059424




**FORM IV** (See Rule 8)

Statement about ownership and other particulars of periodical BALA CHELIMI as required to be published in the first issue every year after the last day of February.

| | | |
|---|---|---|
| 1. Place of publication | : | Hyderabad |
| 2. Periodicity of its publication | : | Monthly |
| 3. Printer's Name | : | M.Veda Kumar |
| Nationality | : | Indian |
| Address | : | "CHANDRAM" 3-6-712/2, Street No.12, Himayatnagar, Hyderabad-500029. |
| 4. Publisher's Name | : | M. Veda Kumar |
| Nationality | : | Indian |
| Address | : | "CHANDRAM" 3-6-712/2, Street No.12, Himayatnagar, Hyderabad-500029. |
| 5. Editor's Name | : | M. Veda Kumar |
| Nationality | : | Indian |
| Address | : | "CHANDRAM" 3-6-712/2, Street No.12, Himayatnagar, Hyderabad-500029. |
| 6. Names and addresses of individuals who own the periodical and partners or shareholders holding More than one per cent of the total capital. | : | M. Veda Kumar |

I, M. Veda Kumar, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
(M. Veda Kumar)


Date : 1st March, 2025 Signature of Publisher

కథ

# బడికి ఎందుకు రాలేదు?

రాజు మూడు రోజులుగా పాఠశాలకు రాలేదు. కారణం తెలుసుకుందామని చైతన్య మాస్టారు రాజు ఇంటికి బయలుదేరాడు. దారిలో రాజు ఎదురయ్యాడు. "రాజు, బడికి ఎందుకు రావడం లేదు," ప్రశ్నించాడు చైతన్య. "నాకు ఏమి తెలియదు సర్, అమ్మ వద్దని చెప్పింది" అంటూ రాజు వెళ్ళాడు. చైతన్య రాజు ఇంటికి వెళ్ళాడు. ఇంట్లో రాజు అమ్మ లక్ష్మి అన్నం వండుతుంది. "మీ అబ్బాయిని పాఠశాలకు ఎందుకు పంపడం లేదు" అడిగాడు చైతన్య. "నాకు ఏమి తెలియదు సర్, మా ఆయన పంపవద్దని చెప్పాడు" చెప్పింది లక్ష్మి. చైతన్య, లక్ష్మి భర్త గోపాల్ పని చేస్తున్న పొలం దగ్గరికి వెళ్ళాడు. "గోపాల్, మీ అబ్బాయిని బడికి ఎందుకు పంపడం లేదు" అన్నాడు చైతన్య. "సారూ, మా అయ్య వద్దని చెప్పాడు. ఆయన్నే అడగండి" అంటూ పనిలో లీనమయ్యాడు గోపాల్. చైతన్య మాస్టారు రచ్చబండ దగ్గర ముచ్చట పెడుతున్న బాలయ్య దగ్గరికి వెళ్ళాడు. "బాలయ్య తాత, మీ మనవడు మూడు రోజుల నుండి బడికి రావడం లేదు. ఎందుకని..." అడిగాడు. "నాకేమీ తెల్వదు బిడ్డా, పెద్దయ్య వద్దన్నారు. అంతే" అంటూ చేతి కర్ర సాయంతో లేచి, మెల్లగా నడుచుకుంటూ వెళ్ళాడు. పెద్దయ్య పేరు వినగానే అక్కడ కూర్చున్న వారు ఒకరి మోహం ఒకరు చూసుకున్నారు. పెద్దయ్య ఊరిలో పెద్ద భూస్వామి. అతని దగ్గర డజను మంది పాలేర్లు పని చేస్తున్నారు. అందులో గోపాల్ ఒకరు. ఊరిలో పెద్దయ్య చెప్పిందే వేదం. రాజ భవనం లాంటి పెద్దయ్య ఇంటికి చైతన్య వెళ్ళాడు. "పెద్దయ్య, మీ పాలేరు కొడుకు రాజును పాఠశాలకు ఎందుకు వద్దన్నారు" అడిగాడు చైతన్య. "నా కేమి తెలియదు. మా చినబాబు వద్దని చెప్పాడు" గర్వంగా చెప్పాడు పెద్దయ్య. మామిడి తోటలో ఉన్న చినబాబు దగ్గరికి వెళ్ళాడు చైతన్య. అక్కడ రాజు మరియు అతని వయసు గల పిల్లలు కొందరున్నారు. వారిని చూడగానే చైతన్యకు చాలా కోపం వచ్చింది. "రాజును పాఠశాలకు ఎందుకు రానివ్వడం లేదు" చైతన్య కోపంగా అడిగాడు. "అతని తాత బాకీ పడ్డాడు. బాకీ తీర్చే వరకు పంపను." మొండిగా వాదించాడు చినబాబు. "వారి పేదరికాన్ని ఆసరా చేసుకుని, బడిలో చదువు కోవలసిన వీరి చేత పనులు చేయిస్తూ, పెద్ద తప్పు చేస్తున్నావు. అందరిని పంపనిచో అధికారులకు ఫోన్ చేసి, నిన్ను అరెస్ట్ చేయిస్తాను" అని ఫోన్ చేతిలోకి తీసుకున్నాడు చైతన్య. చిన బాబు భయపడి అందరిని విడిచిపెట్టాడు. వారిని వారి వారి ఊర్లకు పంపించి, రాజును తీసుకుని పాఠశాలకు బయలు దేరాడు చైతన్య.


– దుర్గమ్ భైతి
రామునిపట్ల, సిద్దిపేట జిల్లా,
m : 9959007914

పంచతంత్ర కథలు

# నీలిరంగు కుండలో పడిన నక్క కథ



ఒక అడవిలో కకుద్రుముడు అనే నక్క ఉంది. ఒకనాడు అది ఆహారం కోసం అడవికి దగ్గరలో ఉన్న ఊరులోకి ప్రవేశించింది. ఊరకుక్కలు దానిని తరిమాయి. అది పారిపోతూ, ఒక చాకలి గుడిసెలో దూరింది. అందులో ఉన్న ఒక బానలో పడిపోయింది. ఆ బానలో నీలిరంగు ఉంది. ఆ రంగులో మునిగిన నక్క నీలంగా తయారయింది. ఊరకుక్కలు దాని కోసం కొంతసేపు వెతికి, వెళ్ళిపోయాయి. తర్వాత నక్క బానలోనుండి బయటపడి, ఎలాగో అడవికి నీలిరంగు నక్క చేరింది. అప్పుడు అడవిలో జంతువులన్నీ ఆ నక్కను చూచి క్రొత్త జంతువు అనుకుని భయపడి పారిపోతున్నాయి. ఇది గమనించి ఆ నక్క 'తంతే బూరెల బుట్టలో పడ్డాను!' అనుకుంది. దానికి ఒక మంచి ఉపాయం తట్టింది. అన్ని జంతువులూ తనను చూసి భయపడుతున్నాయి కాబట్టి నేనే రాజు కావచ్చునని అనుకుంది. ఆ పారిపోయే జంతువుల్ని పిలిచి ఆ నక్క, "మీరేమీ భయపడవలసిన పనిలేదు. ఆ బ్రహ్మదేవుడు నన్ను మీ రాజుగా పంపించాడు. నేను ఈ వనానికి రాజును. మీరంతా నా ఆజ్ఞ పాటించాలి" అని అంది. ఆ వింత మృగాన్ని దేవుడే పంపిచాడని జంతువులు నమ్మాయి. పెద్దపెద్ద జంతువులే దానికి లొంగిపోయాయి. చివరికి సింహం, పులి కూడా తాము వేటాడి తెచ్చిన మాంసాన్ని ఆ నక్క ముందు ఉంచేవి. ఆ నక్క కొద్దిగా మాంసాన్ని వాటికి ఇచ్చి మిగిలిన మాంసాన్ని కడుపారా తినేది. ఇలా ఉండగా ఒక వెన్నెల రాత్రి అడవిలోని నక్కలన్నీ పెద్దగా ఊళ వెయ్యడం మొదలు పెట్టాయి. ఆ కూతలు చెవిన పడగానే నక్క మైమరచి పోయింది. తాను కూడా వాటితో గొంతు కలిపి ఊళ వేసింది. అప్పుడు అది మామూలు నక్కేనని అన్ని మృగాలకూ తెలిసిపోయింది. అవి ఆ నీలినక్కను చంపివేశాయి.

**నీతి : మోసం ఎల్లకాలం సాగదు.**

సేకరణ : అమరావతి

పంచ భూతాలు

# ఆకాశం



వేడి నిచ్చు సూర్యుడు
వెన్నె లిచ్చు చంద్రుడు
తళుకు బెళుకు తారలు
తోక కలుగు చుక్కలు
మిరుమిట్లు మెరుపులు

పిక్కటిల్లు పిడుగులు
దూసు కొచ్చు ఉల్కలు
వాన లిచ్చు మబ్బులు
ఆకాశం హంగులు
ఆనందం అంచులు

– బెలగాం భీమేశ్వరరావు
m : 99895 37835



కథ

# అక్కా తమ్ముడు

## రష్యన్ జానపద కథ

అనగనగా ఒక ఊరిలో ముసలి దంపతులకు ఇద్దరు పిల్లలుండేవారు. పావ పేరు అల్యోనుష్కా, బాబు పేరు ఇవానుష్కా, వాళ్ళిద్దరు అక్కా తమ్ముళ్ళు. తల్లిదండ్రులు చనిపోయాక పిల్లలిద్దరూ ఒంటరివాళ్ళయ్యారు.

ఒక రోజు అల్యోనుష్కా పొలం పనులకు వెళ్తూ, తన తమ్ముడు ఇవానుష్కాను తీసుకెళ్ళింది. వాళ్ళు చాలా దూరం ప్రయాణించారు. తమ్ముడికి బాగా దాహమేసింది.

అక్కా! "నాకు చాలా దాహంగా వుంది" అన్నాడు తమ్ముడు.

"కొంచెంసేపు ఆగు తమ్ముడూ! త్వరలోనే మనకు మంచినీటి బావి కనిపిస్తుంది" అంది అల్యోనుష్కా.

అలా వాళ్ళు చాలా దూరం నడిచారు. ఎండ మండిపోతుంది కానీ మంచినీటి బావి మాత్రం కనిపించలేదు. కొద్దిసేపటికి ఆవు కాలి గిట్టల మధ్య నీరు కనిపించింది.

"నేను ఆ నీళ్ళు కొంచెం తాగుతాను" అన్నాడు తమ్ముడు.

"వద్దు తమ్ముడూ! ఆవు కాలి గిట్టల మధ్య వున్న నీటిని తాగితే నువ్వు లేగదూడగా మారిపోతావు" అంది అక్క. తమ్ముడు అక్క మాట విన్నాడు. చాలా దూరం నడిచారు. ఎండ మండిపోతుంది కానీ మంచినీటి బావి మాత్రం కనిపించలేదు.

మరికొద్దిసేపటికి గుర్రం కాలి గిట్టల మధ్య నీరు కనిపించింది.

"నేను కొంచెం ఆ నీళ్ళు తాగుతాను" అన్నాడు తమ్ముడు.

"వద్దు తమ్ముడూ! గుర్రం కాలి గిట్టల మధ్య వున్న నీటిని తాగితే, నువ్వు గుర్రం పిల్లగా మారిపోతావు" అంది అక్క. తమ్ముడు అక్క మాట విన్నాడు. చాలా దూరం నడిచారు. ఎండ మండిపోతుంది కానీ మంచినీటి బావి మాత్రం కనిపించలేదు.

కొద్దిసేపటికి మేక కాలి గిట్టల మధ్య నీరు కనిపించింది. "నేను కొంచెం ఆ నీళ్ళు తాగుతాను, ఈ దప్పికను భరించలేను" అన్నాడు తమ్ముడు. "వద్దు తమ్ముడూ! మేక కాలి గిట్టల మధ్య వున్న నీటిని తాగితే, నువ్వు మేక



పిల్లగా మారిపోతావు" అంది అక్క.

ఈసారి తమ్ముడు అక్క మాట వినలేదు. మేక కాలి గిట్టల మధ్య వున్న నీటిని తాగాడు. మరుక్షణం పిల్లవాడు, తెల్లటి బుజ్జి మేక పిల్లగా మారిపోయాడు.

"తమ్ముడూ!" అని పిలిచింది. పిల్లవాడికి బదులు, మేకపిల్ల పరిగెత్తుకుంటూ అక్క వద్దకు వచ్చింది.

అక్క బోరున ఏడ్చింది. గడ్డి వాము పక్కన కూర్చున్న అక్క చుట్టూ గెంతుతూ బుజ్జి మేక పిల్ల ఆడుకుంది.

గుర్రంపై వెళ్తున్న ఓ వర్తకుడు ఆ దృశ్యాన్ని చూశాడు. "ఎందుకు ఏడుస్తున్నావు ఓ అందాల భరిణా?" అని అడిగాడు.

అల్యోనుష్కా తన కథంతా చెప్పింది. అది విన్న వర్తకుడు ఇలా అన్నాడు " ఓ అందాల భరిణా! నన్ను పెళ్ళి చేసుకో. నిన్ను బోల్డెంత బంగారం, వెండితో అలంకరిస్తాను. ఈ బుజ్జి మేక పిల్ల కూడా మనతోనే జీవిస్తుంది." అల్యోనుష్కా బాగా ఆలోచించింది. వర్తకుడిని పెళ్ళి చేసుకోవడానికి ఒప్పుకుంది.

త్వరలోనే వాళ్ళు పెళ్ళి చేసుకుని, బుజ్జి మేకపిల్లతో కలసి సుఖంగా జీవించారు. అల్యోనుష్కా తిన్న కంచంలోనే బుజ్జి మేక తినేది. అల్యోనుష్కా మంచినీళ్లు తాగే గ్లాసులోనే బుజ్జిమేక కూడా తాగేది.

ఒక రోజు వర్తకుడు వ్యాపార నిమిత్తం బయటకు వెళ్ళాడు. వున్నట్టుండి ఎక్కడి నుండో ఓ మంత్రగత్తె మారువేషంలో ఊడిపడింది. అల్యోనుష్కా గది కిటికి వద్దకు వచ్చిన మంత్రగత్తె, నదిలో స్నానానికి తనతో రమ్మని బతిమిలాడింది.

మంత్రగత్తెతో కలసి అల్యోనుష్కా నదికి వెళ్ళింది. మంత్రగత్తె అల్యోనుష్కా మీద పడి బంధించింది. అల్యోనుష్కా మెడకు ఓ బండరాయి కట్టి, నదిలోకి తోసేసింది. అచ్చం అల్యోనుష్కాలా మారి, ఆమె బట్టలు, నగలు ధరించి, అల్యోనుష్కా ఇంటికి వెళ్ళింది మంత్రగత్తె. అల్యోనుష్కా రూపంలో వున్న మంత్రగత్తెను చూసి, అందరూ అల్యోనుష్కానే అనుకున్నారు. చివరకి వర్తకుడు కూడా ఆమె వేషాన్ని గుర్తించలేకపోయాడు.

మంత్రగత్తె చేసిన మోసం గురించి బుజ్జి మేకపిల్లకు మాత్రమే తెలుసు. బుజ్జి మేక దిగులుతో తల వేలాడేసుకొని కూర్చునేది, తిండి తినేది కాదు. ఏదీ తాగేది కాదు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం బుజ్జి మేకపిల్ల నది ఒడ్డుకు వెళ్ళి ఇలా అనేది.

"అల్యోనుష్కా అక్కా! అల్యోనుష్కా అక్కా!
నా మాటలు వినిపిస్తున్నాయా?
నా వద్దకు ఈదుకుంటూ రా?"

బుజ్జి మేక దినచర్యను గమనించిన మంత్రగత్తె, దాన్ని చంపాలని పథకం వేసింది. దాన్ని చంపమని వర్తకుడిని ఒత్తిడి చేసింది.

బుజ్జి మేకను చంపడం వర్తకుడికి ఇష్టం లేదు. కానీ మంత్రగత్తె రాత్రింబవళ్ళు అతడిని ఒత్తిడికి గురి చేసింది. విసుగు చెందిన వర్తకుడు ఇలా అన్నాడు. "దానిని నీ ఇష్టం వచ్చినట్టు చేసుకో."

మంత్రగత్తె ఆనందంతో మంటలను రాజేసింది. పెద్ద కుండలలో నీళ్ళను కాచి, కత్తులను సాన పెట్టించింది.





తనకు రోజులు దగ్గర పడ్డాయని గ్రహించిన బుజ్జి మేక వర్తకుడితో ఇలా అంది.

"మీరు నన్ను తండ్రిలా ఎంతో ప్రేమగా చూసుకున్నారు. నా చివరి కోరికను మన్నించి, నన్ను నది వద్దకు పంపండి. ఆఖరిసారి ఆ నది నీటిని ఓసారి తాగి వస్తాను".

బుజ్జి మేక చివరి కోరికను వర్తకుడు అంగీకరించాడు.

మేకపిల్ల పరిగెత్తుకుంటూ నది వద్దకు వెళ్ళి బాధతో ఇలా అంది

"అక్కా! అక్కా! అల్యోనుష్కా అక్కా!
అక్కా! అక్కా! అల్యోనుష్కా అక్కా!
నా వద్దకు రా! నా వద్దకు రా
నీటి ఒడ్డుకు ఈదుకురా
మాయలమారి వచ్చింది.
నీ వేషం వేసింది.
నన్ను చంపమని చెప్పింది
కత్తులు పదును పెడుతుంది"

నదిలో నుండి అల్యోనుష్కా ఇలా అంది

"నా చిన్ని తమ్ముడు ఇవానుష్కా
నన్ను బండరాయి కిందుంచింది
కాళ్ళను తాడుతో బంధించింది
ఇసుకలో దిగబడి వున్నాను
బైటకు రాలేకున్నాను"

మంత్రగత్తె, బుజ్జిమేక కోసం వెతికింది. కాని అది కనపడలేదు. మేక పిల్లను వెతికి తన వద్దకు తీసుకురమ్మని పనివాడిని ఆదేశించింది.

పనివాడు నది వద్దకు వెళ్ళి ఆ దృశ్యాన్ని చూశాడు. బుజ్జిమేక నది వద్ద అటూ ఇటూ పరిగెత్తుతూ బాధతో ఇలా అరుస్తుంది

"అక్కా! అక్కా! అల్యోనుష్కా అక్కా!
అక్కా! అక్కా! అల్యోనుష్కా అక్కా!
నా వద్దకు రా! నా వద్దకు రా
నీటి ఒడ్డుకు ఈదుకురా
మాయలమారి వచ్చింది
నీ వేషం వేసింది
నన్ను చంపమని చెప్పింది
కత్తులు పదును పెడుతుంది"

నదిలో నుండి అల్యోనుష్కా ఇలా అంది

"నా చిన్ని తమ్ముడు ఇవానుష్కా
నన్ను బండరాయి కిందుంచింది
కాళ్ళను తాడుతో బంధించింది.
ఇసుకలో దిగబడి వున్నాను.
బైటకు రాలేకున్నాను"

పనివాడు ఇంటికి పరుగెత్తుకుంటూ వచ్చి తను విన్నది, చూసింది వర్తకుడికి చెప్పాడు.

ఊరిలోని ప్రజలంతా కలిసి నది వద్దకు వెళ్ళారు. వలను నదిలో విసిరి, అల్యోనుష్కను కాపాడారు.

తన మెడకు వున్న పెద్ద బండరాయిని తొలగించారు. అల్యోనుష్కా తాజా నీటిలో స్నానం చేసింది.

అందమైన దుస్తులను ధరించింది. అప్పుడు అల్యోనుష్కా, మునుపటి కంటే అందంగా మెరిసిపోయింది.

బుజ్జి మేక ఆనందంతో పిల్లిమొగ్గలు వేసింది. ఆ మరుక్షణమే బుజ్జిమేక, తన తమ్ముడు ఇవానుష్కాలా మారిపోయాడు.

ఊరి ప్రజలు మంత్రగత్తెను బంధించి గుర్రపు తోకకు కట్టారు.

బెదిరిన గుర్రం మైదానంలోకి దౌడు తీసింది.

స్వేచ్ఛానువాదం : అనిల్ బత్తుల
m : 8179273974
రష్యన్ : అల్యోనుష్కా & హర్ లిటిల్ బ్రదర్ ఇవానుష్కా
ఇంగ్లీష్ అనువాదం : ఇరినా జెలెన్‌జోవా
బొమ్మలు : టి. షెవర్యోవ

# ఫోన్ నెంబర్ చెప్పడం



1. మీ ఫోన్ నెంబర్ 10 అంకెలు రాయండి.
2. దాని చివర 0 చేర్చండి.
3. ఇప్పుడు ఈ 11 అంకెల సంఖ్య నుండి మీ ఫోన్ నెంబర్‌ను తీసివేయండి.
4. వచ్చిన జవాబును 3తో భాగించండి.
5. ఇప్పుడి వచ్చిన సంఖ్యను నాకు చెప్పండి. మీ ఫోన్ నెంబర్‌ను చెప్పేస్తాను.

ఉదా: **నా ఫోన్ నెంబర్ 9440926937**

**94409269370 – 9440926937 = 84968342433**

**84968342433 ÷ 3 = 28322780811**

**28322780811 అని చెప్పగానే 9440926937 మీ ఫోన్ నెంబర్ అని చెప్పాలి.**

రహస్యం : చివరగా చెప్పిన సంఖ్యను 3తో భాగించడమే.

## BEAUTY NUMBER—14

$$1 \times 8 + 1 = 9$$
$$12 \times 8 + 2 = 98$$
$$123 \times 8 + 3 = 987$$
$$1234 \times 8 + 4 = 9876$$
$$12345 \times 8 + 5 = 98765$$
$$123456 \times 8 + 6 = 987654$$
$$1234567 \times 8 + 7 = 9876543$$
$$12345678 \times 8 + 8 = 98765432$$
$$123456789 \times 8 + 9 = 987654321$$

– అంకెల మామయ్య చంద్రయ్య
m: 9440926937

కథ

# పటికం
## (మారిన బాలల కథ)



ఒక అడవిలో ఒక కోతుల మూక ఉండేది అందులో పటికం అనే కోతి చాలా చలాకీగా ఉండేది. ఒకరోజు పటికం మూకతో నడుచుకుంటూ పోతూ ఉండగా దారిలో ధగధగ.. మెరుస్తూ ఒక వజ్రాలహారం కనిపిస్తుంది. పటికం వజ్రాల హారం మెడలో వేసుకుంటుంది.

అది గమనించిన నాయకుడు "అడవిలో ఏ వస్తువు దొరికినా అది మృగ రాజుకు చెందుతుంది. మనం దీన్ని తీసుకువెళ్లి మృగరాజుకు ఇద్దాం," అంటాడు. పటికం ఆ వజ్రాలహారాన్ని నాయకుడికి యిచ్చేస్తుంది. నాయకుడు దాన్ని తీసుకువెళ్లి మృగరాజు సింహానికి అందజేస్తాడు. సింహం చాలా సంతోషించి నాయకుడిని అభినందించి, సత్కరించి పంపుతాడు.

ఒకరోజు మృగరాజు సింహం బిడ్డ పుట్టినరోజు వస్తుంది. ఎప్పటిలా వేడుకకు అడవిలోని జంతువులన్నిటినీ పిలుస్తుంది సింహం. అడవిలో ఉన్న నక్కలు, ఏనుగులు, కోతులు, జింకలు, ఎలుగుబంట్లు, కొంగలు, చిలుకలు, కాకులు ఇలా రకరకాల సమూహాలు కానుకలు తెచ్చాయి. పటికం కూడా ముత్యాలు సేకరించి అందమైన హారం తయారు చేసింది. కోతుల నాయకుడు ముత్యాలహారాన్ని మృగరాజు బిడ్డ మెడలో వేసి దీవించి మృగరాజు ఆశీస్సులు తీసుకుంటాడు. సింహం ఆనందించి కోతుల నాయకుడికి కానుకలిస్తాడు.

ఇదంతా నక్కల గుంపులో ఉన్న చౌరి అనే నక్క గమనించి పటికం వద్దకు పోయి "మిత్రమా! మీ కోతుల మూకలో నువ్వు ఎంత పనిచేసినా నీకు విలువ లేదు. నువ్వు గుంపులో గోవిందగా ఉండిపోతావు. కష్టం నీది ఫలితంగా సన్మానాలు మీ నాయకుడికి!" అంది. పటికం ఆలోచనలో పడింది. ఇదే అదునుగా చౌరి "మిత్రమా! నువ్వు మూకతో ఉన్నంత కాలం ఇలాగే ఇంటావు. మూకలోంచి బయటకొస్తే నీ విలువ నలుగురికీ తెలుస్తుంది. మృగరాజు దగ్గర విలువైన నగలున్నాయి. వాటిని దొంగిలించి అడవి వదిలి గ్రామానికి పోయి భోగభాగ్యాలు అనుభవిస్తూ హాయిగా బ్రతుకు!" అని సలహా యిచ్చింది. చౌరి మాటలు పటికంకు రుచించాయి.

ఒకరోజు ఉదయం మృగరాజు గుహలో లేంది చూసి చౌరి సహాయంతో నగలు దొంగిలించి అడవి వదిలి పారి పోయింది పటికం. గుహ బయట కోతి పాద ముద్రలు గమనించింది సింహం. కోతుల నాయకుడిని పిలిపించి మూకను తన వద్దకు తీసుకురమ్మన్నాడు. మూకలో పటికం లేకపోవటం గమనించాడు మృగరాజు. "చూడు! నీ మూక మంచి చెడులకు నాయకుడిగా నువ్వే బాధ్యుడవు. పటికం కోసం అడవే కాదు.. చుట్టు పక్కల గ్రామాలు వెతికిస్తాను. పటికం దొరికేవరకు నువ్వు మా చెరశాలలో బంధీగా ఉంటావు" అంటూ నాయకుడిని బంధించి చెరశాలలో వేశాడు మృగరాజు.

మరునాడు కాకి ద్వారా అడవి విషయాలు తెలుసుకున్న పటికం తన వలన నాయకుడికి శిక్ష పడటం బాధ కలిగింది.' ఖ్యాతి, అపఖ్యాతి, మంచి, చెడులకు బాధ్యుడు ఆ సమూహ నాయకుడే! నా వలన నాయకుడికి చెడ్డపేరు రాకూడదు!' అనుకుంది. వెంటనే దొంగిలించిన నగలు తీసుకుని అడవి బాట పట్టింది పటికం. అసలు విషయం తెలుసుకున్న మృగరాజు పటికంను క్షమించి వదిలేశాడు.


– పైడిమర్రి రామకృష్ణ
m : 9247564699




# పుస్తక పరిచయం




**వెన్నెల గువ్వలు**
(బాలల కథా సంపుటి)
ఐతా చంద్రయ్య
m : 9391205299





**బాల కథా చంద్రిక**
(బాలల కథలు)
ఉండ్రాళ్ళ రాజేశం
m : 9966946084




**పెరవలి**
**బడి పిల్లల కథలు**
**కర్నూలు జిల్లా**
పుల్లా రామాంజనేయులు
m : 7815081257

**గురువు మాట**
(ఆట వెలది శతకం)
పోడేటి సమజ్ఞ
ఇంటర్మీడియట్ సాధన
జూనియర్ కళాశాల, ధర్మారం





**ఓ పులికూన కథ**
డా. సిరి
m : 9000646728




**జర్నీ**
వట్టిమర్తి విద్యార్థుల యాత్రా
నేపథ్య కథలు
పెరుమాళ్ళ ఆనంద్
పొట్టబత్తుల రామకృష్ణ




**ఫ్లయింగ్ బర్డ్స్**
విద్యార్థుల కవితా సంకలనం
సి. కిరణ్ కుమార్
జిల్లా పరిషత్ ఉన్నత
పాఠశాల, పానగల్
m : 9441016299





**అక్కా చెల్లెలు**
(పిల్లల కథలు)
ఆస్మీన్
ఇంటర్మీడియట్ మైనార్టీ
వెల్ఫేర్ కాలేజ్, జగిత్యాల




**అంజు**
అమరవాది నీరజ
గోపాల కృష్ణ
m : 9849160055


**ఈ కాలం పిల్లాడు**
నారంశెట్టి
ఉమామహేశ్వరరావు
m : 9490799203




**బాల కవితా కుసుమాలు**
పెందోట బాల సాహిత్య
పీఠం-2024
కవితల పోటీలు
పెందోట వెంకటేశ్వర్లు
m : 9440524546





**రాకాసి ఎర్వాం రక్ష**
ద్విభాష బాలల కథా
సంపుటి
తెలుగు: డా.సిరి
కోయ అనువాదం:
పద్దం అనసూయ
m : 9000646728







**కీలుగుర్రం**
బాల గేయాలు
(రచనా కాలం 1965-66)
డా. ఎన్. గోపి





**తెలివి తేటలు**
పిల్లల కథలు
సంగనభట్ల చిన్నరామకిష్టయ్య
m : 9908554535




**అభినందన**
పిల్లల కథలు - బొమ్మలతో
కేవీ సుమలత
m : 9492656255

చరిత్ర పాఠాలు-1





# అగ్ని - సాంస్కృతిక పునాది


ఇప్పటికి సుమారు 26 నుంచి 30 లక్షల క్రితం ఆది మానవులు తమ తోటి జంతు ప్రపంచం నుంచి విడివడటం ప్రారంభించారు. అందుకు వారికి దోహదం చేసినవి రెండు ఆవిష్కరణలు: ఒకటి, రాతి పనిముట్లను వాడటం; రెండు అగ్నిని పుట్టించడం నేర్చుకొని వాడటం. సుమారు 25 లక్షల సంవత్సరాల క్రితం టాంజానియా దేశంలోని ఓల్డువాయి లోయలో మొట్టమొదటిసారిగా ఆదిమానవులు రాతి పనిముట్లను వాడటం నేర్చుకున్నారు. ఆ తరువాత సుమారు 10 లక్షల సంవత్సరాలకు అవసరం పడినప్పుడల్లా అగ్నిని పుట్టించడం నేర్చుకున్నారని తెలిపే ఆధారాలు దక్షిణాఫ్రికాలోని స్వర్ట్ క్రన్స్‌లో లభించాయి. అక్కడ కాలిన జంతువుల ఎముకలు, పొయ్యిలు కనిపించాయి. కాని ఏ మనిషి మొదట ఎలా అగ్నిని కృత్రిమంగా పుట్టించాడో తెలిపే ఆధారాలు అంతర్జాతీయంగా ఇప్పటివరకు లభించలేదు. భారతదేశంలో మాత్రం అథర్వణ, ఋక్, సామ వేదాలలోఎవరు అగ్నిని ఎలా సృష్టించారో తెలిపే స్పష్టమైన ఆధారాలున్నాయి. ఋగ్వేదంలోని 6వ మండలం 16వ అధ్యాయం 13వ ఋక్ అథర్వుణుడు అనే ఋషి తామరాకు పైనుంచి అగ్నిని పుట్టించాడని, ఆ అగ్ని తలమానికమైనదని, విశ్వాధారమైనదని ప్రస్తావించింది. అగ్నిని కనిపెట్టినందుకు ఆయనకు అంగీరసుడనే పేరు వచ్చింది. ఆయన ఆవిష్కరణను అనుసరించి అడ్డ కట్టెపుల్ల మీద నిలువు కట్టెపుల్లను తిప్పి అగ్నిని పుట్టించే ఋగ్వేద ఋషులందరికీ అంగీరసులు అనే పేరు వచ్చింది.

మొట్టమొదట "యాంత్రిక పద్ధతి"తో అగ్ని పుట్టించడాన్ని కనుగొన్న అథర్వుణుని తరువాత విశ్వామిత్రుడు "అధిమంథన ప్రజననామ్" అనే 'అగ్నిని పుట్టించే యంత్రం' ను వెలుగులోకి తెచ్చాడని ఋగ్వేదం 3వ మండలం 29వ అధ్యాయం 1-12 ఋక్కుల్లో ఉంది. ఆ యంత్రం ఎలా అగ్నిని పుట్టించేదంటే... ఒక మూరెడు పొడవైన బల్లపరుపు కట్టెపుల్లను ఒక అరికాలు కింద అదిమి పెట్టుకుని మరో మూరెడు పొడవైన కట్టపుల్లను రెండు అర చేతుల్లో పట్టుకుని, కింది పుల్లపై నిలబెట్టి వేగంగా తిప్పుతుంటే కొద్దిసేపటికి రెండు పుల్లలు రాపిడికి గురవుతున్న స్థానంలో వేడి పెరిగీ పెరిగీ ఒక్కసారిగా అగ్ని రవ్వలు జనిస్తాయి. ఆ అగ్ని రవ్వల దగ్గర ఎండిన తామరాకు నారలు లేదా ఏదైనా ఎండిన గడ్డి పెడితే ఆ నార గడ్డి అంటుకుంటుంది.

ఆసక్తికరమైన విషయమేమిటంటే... సరిగ్గా ఇదే పద్ధతిలో అగ్ని పుట్టించుకోవడం అనేది ఇటీవలి కాలం వరకు తెలంగాణకు దక్షిణాదిన నల్లమల అడవుల్లో నివసిస్తున్న చెంచు గిరిజనులలో ఆచారంగా ఉండేది. ఇప్పటికీ కొన్ని సుదూరపు చెంచు పెంట (గూడెం)లలో అగ్గిపెట్టెలు ఐపోయినప్పుడు ఇలానే అగ్గిని పుట్టించుకుంటారు. ఈ చెంచులే చలికాలంలో పొడవాటి ఎండిన చెట్టు కాండానికి నిప్పుపెట్టి వారాలపాటు కాలే ఆ కాండం నిప్పు దగ్గరే కూర్చుని చంపిన జంతువుల మాంసం ముక్కలను కాల్చుకుని తింటూ, చలి కాచుకుంటూ, జంతువులను చాకచక్యంగా ఎలా వేటాడాలో ఆటపాటల ద్వారా తమ పిల్లలకు నేర్పించుకుంటూ కాలం గడుపుతుంటారు.

ఇలా ప్రపంచమంతటా అగ్నిని కనుగొన్న తరువాతనే ఆహార, విహార, సామాజిక సంస్కృతులు వికసించాయి. ఇప్పటికీ గ్రామీణులు "వారం చేయడం" పేరిట ప్రతి ఆది'వారం' నాడు పాలను అగ్నికి ఆహుతిచ్చిన తరువాతనే ఆరగించడం అనేది అనాది ఆది సంస్కృతికి ఆనవాలు.

-డా. ద్యావనపల్లి సత్యనారాయణ
m : 9490957078



# ఆత్మవిశ్వాసం కీలకం

బండనైనా చీల్చుకుని
బయటికి వచ్చే విత్తును
తీక్షణంగా గమనించు!
దాని స్ఫూర్తి స్వీకరించు!

విషమ పరిస్థితులెన్ని
తారసిల్లిన కూడా
లెక్క చేయక ఎదిగే
మొక్క ధైర్యం గాంచు!

ప్రయత్నం చేస్తేనే
ఏదైనా సాధ్యమే!
అడ్డంకులు ఎదురైనా
విజయాలిక తథ్యమే!

తొణకని ఆత్మవిశ్వాసం
గుండె నిండా సాహసం
విజయాలకు తొలి అడుగు
బ్రతుకులో రక్షణ గొడుగు

– గద్వాల సోమన్న
ఎమ్మిగనూరు, కర్నూలు
m : 9966414580



## చెలిమి క్లబ్

చెలిమిక్లబ్‌లో సభ్యత్వం తీసుకోండి
లాభాలు పొందండి.

1. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించే పుస్తకాలపై ప్రత్యేక తగ్గింపు.
2. మీ ప్రతి పుట్టిన రోజుకు అభినందనలతో అందమైన గ్రీటింగ్ కార్డు.
3. మీలో ఉన్న టాలెంట్‌ను అభివృద్ధి చేసుకోవడానికి క్లబ్ నిర్మాణాత్మక సహకారం అందిస్తుంది.
4. మీ స్కూల్లో, ఊర్లో పిల్లల కార్యక్రమాల వార్తలను చెలిమి సమాచారపత్రికకు పంపడానికి మీరు విలేఖరిగా ఉండవచ్చు.
5. అందమైన మెంబర్‌షిప్ బ్యాడ్జి.
6. మిమ్మల్ని ఆశ్చర్యపరచే బహుమతులు.

### చెలిమి క్లబ్

పేరు : ------------------
తండ్రి పేరు : ------------------
పుట్టినతేదీ : ------------------
చిరునామా : ------------------
------------------
------------------
పిన్ : ------------------
హాబీలు : ------------------
మొబైల్ : ------------------
ఇ-మెయిల్ : ------------------

ఈ వివరాలతో మెయిల్ చేయండి.

బాల చెలిమి ఇ-మెయిల్ :
desk.chelimi@gmail.com







# ఫాల్గుణ మాసం

శాలివాహన శక కాల పరిగణనలో ఫాల్గుణ మాసం పన్నెండో నెల. ఫల్గుణి నక్షత్ర కాంతి పరిధిలో సూర్యచంద్రుల గమనాన్ని బట్టి ఈ నెల ఆ నక్షత్రం పేరు మీదుగా 'ఫాల్గుణ మాసం' అయింది. ఈ మాసంలో శిశిర ఋతువు వస్తుంది. చెట్లు ఆకులు రాలుస్తాయి. భారతీయులు ఈ నెలలోనే 'హోలిక' ఉత్సవం జరుపుకొంటారు.

హిరణ్య కశిపుడి సోదరి హోలిక. ఆమె ప్రహ్లాదుడిని, ఒళ్ళో కూర్చోబెట్టుకొని దహించి వేయాలని అనుకుంది. ఆ మంటల్లో ఆమె దహనమై పోయింది. విష్ణుమూర్తి వరం వలన ప్రహ్లాదుడు క్షేమంగానే ఉన్నాడు. 'హోలిక' దుష్ట రాక్షసి చనిపోయిన రోజు కనుక ఆ రోజున ప్రజలు వసంతం చల్లుకుని వేడుకగా పండుగ చేసుకుంటారు. తెలుగు వారి కొత్త సంవత్సరం ఆరంభం 'ఉగాది' ఈ నెలలోనే వస్తుంది.

## మార్చి

రెండు గుర్రాలు పూన్చిన రథం మీద సందడిగా, భీకరంగా వచ్చే రోమన్ల దేవుడు 'మార్స్' పేరు మీద 'మార్చి' నెల ఏర్పడింది. ఒక చేతితో శూలం, మరో చేత్తో డాలు ధరించి ఉండే మార్స్‌ను యుద్ధ దేవతగా రోమన్లు కొలిచే వారు. ఒక రకం పక్షులకు మొక్కజొన్న గింజలు వేసేవారు. అవి ఆత్రంగా తింటే 'మార్స్' తమ పక్షాన ఉన్నాడని వారి విశ్వాసం. లేకపోతే విజయం కష్టమనీ నమ్మేవారు. మహా శక్తివంతుడైన ఈ దేవుడి పేరు 'మార్స్' వలనే 'మార్చి' నెల పేరు వచ్చింది.

**– 'బాల కథా సౌరభం' నుండి...**



# పక్షులు, జంతువులు







| పక్షులు, జంతువులు | శాస్త్రీయ నామం | తెలుగు పేరు |
|---|---|---|
| 1) Arabain Camel | Camelus dromedaries | ఒంటె |
| 2) Bat | Chirroptera | గబ్బిలం |
| 3) Bird | Aves | పక్షి |
| 4) Goat | Capra aegagrus hircus | మేక |
| 5) Polar bear | Ursus maritimus | ఎలుగుబంటి |
| 6) Buffalo | Babalus bubalis | గేదె |
| 7) Cat | Felis domesticus | పిల్లి |
| 8) Cheetah | Acinonyx jubatus | చీత |
| 9) Cobra | Naja naja | నాగుపాము |
| 10) Crocodile | Crocodylus palustris | మొసలి |
| 11) Deer | Cervidae | జింక |
| 12) Dog | Canis lupus familiaris | కుక్క |
| 13) Dolphin | Delphinus delphis | డాల్ఫిన్ |
| 14) Fish | Vertebrata | చేప |
| 15) Indian Elephant | Elephas maximus indicus | ఏనుగు |
| 16) Hen | Gallus gallus domesticus | కోడిపెట్ట |
| 17) Horse | Equus caballus | గుర్రం |
| 18) Parrot | Psittaciformes | చిలుక |
| 19) Leopard or Panther | Panthera pardus | చిరుతపులి |
| 20) Monkey | Cercopithe cidae | కోతి |
| 21) Mosquito | Culicidae | దోమ |
| 22) Lion | Panthera leo | సింహం |
| 23) Lizard | Lacertilia | బల్లి |
| 24) Peacock | Pavo cristatus | నెమలి |
| 25) Pig | Sus scrofa doemesticus | పంది |
| 26) Prawn | Dendrobranchiata | రొయ్య |
| 27) Rat | Rattus | ఎలుక |
| 28) Sheep | Ovis aries | గొర్రె |
| 29) Tiger | Panthera tigris | పులి |
| 30) Wolf | Canis lupus | తోడేలు |
| 31) Zebra | Eguus guagga | కంచరగాడిద |
| 32) Honey bee | Apismellifera | తేనెటీగ |
| 33) Pigeon | Coumbidae | పావురం |

– 'ఆరోగ్యం – విజ్ఞానం' తెలంగాణ సారస్వత పరిషత్తు నుండి...



# కాకిని తక్కువ అంచనా వేస్తున్నారా?




కాకిని చూడని వారు అంటూ బహుశా ఎవరూ ఉండరు. కాకి మీద ఎన్నో సామెతలు ఉన్నాయి. ఆ పక్షి మన పిట్టగోడ మీద నుంచి అరిస్తే చాలు ఈరోజు మన ఇంటికి ఎవరో చుట్టాలు వస్తున్నట్లు భావిస్తాం. అంతే కాదు, పితృ దేవతలకి మనకి సంధానకర్తగా అనుకోవడం కద్దు. మనం పెట్టిన పిండం కాకి ముట్టకపోయినట్లయితే పై లోకంలో ఉన్న పెద్దలు మనపై కోపంగా ఉన్నారేమో అనుకుంటాం. ఇవన్నీ నిజమా, కావా అన్నది అటుంచితే కాకితో మానవుడి జీవితం ఎంతగా పెనవేసుకుపోయిందో ఈ ఉదంతాలు తెలుపుతాయి. మరి ఇంతటి ప్రాముఖ్యత గల ఆ జీవులు గూర్చి కొంతైన తెలుసుకోవాలి. కాకులు మందలోనూ, ఒంటరిగానూ జీవిస్తాయి. వీటి జీవిత కాలం రమారమి ఇరవై ఏళ్ళు.

ఇవి మనుషుల మొహాల్ని బాగా గుర్తుంచుకోగలవు. దాదాపు అయిదేళ్ళ పాటు గుర్తుంచుకుంటాయంటే ఆశ్చర్యంగా లేదూ! ఏడు ఏళ్ళ పిల్లలకి ఉండేంత తెలివి వీటికి ఉంటాయి. అంటే ముఖ్యంగా సమస్యని పరిష్కరించుకోవడంలో, కమ్యూనికేట్ చేయడంలో కాకికి ఉండే నైపుణ్యం ఆ స్థాయిలో ఉంటుంది. దాని మెదడులో కూడా మనకి మల్లే చిక్కగా అల్లుకుని ఉండే న్యూరాన్లు ఉంటాయి. మనుషులు చేసే మంచి పనులు, చెడ్డ పనులు కూడా అవి గుర్తు పెట్టుకోగలవు. అంటే కాకికి మీరు అన్నం పెట్టినా, ప్రేమగా చూసినా అవి మిమ్మల్ని చాలా కాలం గుర్తుంచుకుంటాయి. మీకు దగ్గరగా ఉండటానికి ప్రయత్నిస్తాయి. మీరు గనక వాటి పిల్లలకి రాళ్ళు వేసినా లేదా వాటి గూడుకి దగ్గరగా వెళ్ళినా, పాడు చేసినా మిమ్మల్ని గుర్తు పెట్టుకుని తగిన గుణపాఠం కూడా చెబుతాయి. అప్పుడప్పుడు పేపర్లలో చదువుతుంటాం. కాకి పగబట్టి వేధిస్తున్నదని, బయటకి వచ్చినప్పుడల్లా కాళ్ళతో నెత్తి మీద తన్ని పోతున్నాయని ఆవేదనతో ఆత్మహత్య చేసుకున్న వాళ్ళు కూడా ఉన్నారు.

మరి అలాంటి సమయంలో ఏం చేయాలి అంటే మనం ఉండే ప్రదేశాన్ని గాని, ఊరిని గాని మార్చడమే చేయగల పని. అంతే తప్పా వేరే దారి లేదు. ఒక్కోసారి కాకులు బాగా అరుస్తుంటాయి. రొద పెడుతుంటాయి. వాటిలో వాటికి కోపం వచ్చినప్పుడు లేదా ఇతర సంగతుల్ని కమ్యూనికేట్ చేసుకోవడానికి అలా అరిచి గోల చేస్తుంటాయి. రాత్రి పూట ఆలశ్యంగా గూళ్ళకి వచ్చిన కాకులు చెట్టుకి కింద ఉన్న కొమ్మల మీదకి వెళ్ళవలసిందిగా మిగతా వాటిని అడుగుతుంటాయి. అవి మనకి గోలగా అనిపించడం సహజమే.

సాధారణంగా కాకులు మర్రి చెట్ల మీద, ఇతర పెద్ద చెట్ల మీద, తోటల్లో నివసిస్తాయి. పండ్లను, చిన్న పురుగుల్ని, ధాన్యాల్ని, చేపల్ని తింటాయి. కోడి పిల్లల్ని ఎత్తుకు పోతుంటాయి. ఇతర పక్షుల గూళ్ళని పాడు చేసి వాటి గుడ్లని కూడా తినేస్తాయి. మనం వాటికి ఏదైనా ఆహారం వేసినా గుర్తు పెట్టుకుని అవి మనల్ని విష్ చేస్తాయి. అయితే వాటి భాష మనం అర్థం చేసుకోలేము కనక పట్టించుకోము. ఏ కాకి అయినా మనల్ని చూసి తలని బౌ చేసినట్లుగా ఊపితే థాంక్యూ అని అర్థం అన్న మాట. అంతే కాదు, వాటికి బాగా నచ్చినట్లయితే కొన్ని బహుమతుల్ని కూడా మనకి ఇస్తుంది. రంగు రంగుల చిన్న రాళ్ళు, మెరిసే ఆకులు ఇలాంటి వాటిని మనకి దగ్గర్లో పారేసి పోతుంది. చూశారా, మనం రోజూ చూసే కాకి వెనుక ఎంత కథ ఉన్నదో!

– మూర్తి కెవివిఎస్
m : 7893541003



## కలంచెలిమి



**ఎం. లక్ష్మి నరసింహా**
9వ తరగతి
జెడ్పిహెచ్ఎస్, పోతుగల్,
ముస్తాబాద్ మండలం,
రాజన్న సిరిసిల్ల.



**గాజంగుల శ్రీవేద**
7వ తరగతి
జెడ్పిఎస్ఎస్,
లక్ష్మీ పూర్, ఆదిలాబాద్ జిల్లా.

**మాడుగుల నాగలక్ష్మి**
9వ తరగతి
జెడ్పిహెచ్ఎస్, కామేపల్లి,
గుండ్లపల్లి మండలం, నల్గొండ జిల్లా.



**ఎం. హరిణి**
9వ తరగతి, జెడ్పిహెచ్ఎస్,
సిర్పూర్.





**మాలోత్ అమృత**
9వ తరగతి ఇంగ్లీష్ మీడియం,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
వడ్డేపల్లి, వర్ని, నిజామాబాద్.



**సిహెచ్. యక్షిత**
7వ తరగతి, జి.ప.ఉ.పా. పాపకొల్లు,
జూలూరుపాడు మండలం,
భద్రాద్రి కొత్త గూడెం జిల్లా.

# భారతీయ రాష్ట్రాలు : నృత్య రూపాలు

ఒక దేశం యొక్క పెరుగుదల మరియు అభివృద్ధిలో కళలు, సంస్కృతి ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయి. ఒక దేశం యొక్క గుర్తింపు మరియు వారసత్వాన్ని ప్రతిబింబించడం. ఇతర దేశాలతో దౌత్య సంబంధాలను ఏర్పరచుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయి. భారతీయ చరిత్ర, కళలు మానవ ఉనికిలో అంతర్భాగంగా ఉన్నాయి.

దృశ్య కళలు, సంగీతం, నృత్యం, సాహిత్యం మరియు నాటక రంగం వంటి వివిధ రూపాల్లో కళలు కమ్యూనికేషన్ మాధ్యమంగా ఉంది. వ్యక్తులలో సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచనను పెంపొందిస్తుంది.

భారతీయ సంస్కృతిలో నృత్యం ప్రముఖ స్థానాన్ని కలిగి ఉంది. దీనిని రెండు ప్రధాన రూపాలుగా వర్గీకరించారు. 1. శాస్త్రీయ నృత్యం, 2. జానపద నృత్యం.

1. శాస్త్రీయ నృత్యం: పురాతన గ్రంథం నాట్య శాస్త్రం నుండి గుర్తించింది. భారతదేశంలో సాంప్రదాయకంగా 8 గుర్తింపు పొందిన శాస్త్రీయ నృత్య రూపాలు ఉన్నాయి.

భారతదేశంలోని సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఇటీవల చౌను శాస్త్రీయ నృత్యాల జాబితాలో చేర్చింది. మొత్తం 9 శాస్త్రీయ నృత్య రూపాలు ఉన్నాయి.

### భారతీయ శాస్త్రీయ నృత్యాల జాబితా

| క్ర.సంఖ్య | క్లాసికల్ డ్యాన్స్ పేరు | క్లాసికల్ డ్యాన్స్ ప్రదేశం |
|---|---|---|
| 1. | భరతనాట్యం | తమిళనాడు |
| 2 | కథక్ | ఉత్తర భారతదేశం |
| 3 | కథాకళి | కేరళ |
| 4 | కూచిపూడి | ఆంధ్రప్రదేశ్ |
| 5 | మణిపురి | మణిపూర్ |
| 6 | మోహినియాట్టం | కేరళ |
| 7 | ఒడిస్సీ | ఒడిశా |
| 8 | సత్రియా | అస్సాం |
| 9 | చౌను | పశ్చిమ బెంగాల్ |




శాస్త్రీయ నృత్యం "నవరసాలు" అని పిలువబడే 8 ప్రాథమిక భావోద్వేగాలను వ్యక్తపరుస్తుంది.

1. శ్రింగర్ (ప్రేమ), 2. హాస్యం (హాస్యం), 3. కరుణ (దుఃఖం), 4. రౌద్ర (కోపం), 5. వీర్ (వీరత్వం), 6. భయానక్ (భయం), 7. బిభాట్స్ (అసహ్యం), 8. అద్భుతం (వండర్)





**2. భారతదేశంలోని ముఖ్యమైన జానపద నృత్యాలు:**

| రాష్ట్రం | సాంప్రదాయ నృత్యాలు |
|---|---|
| ఆంధ్రప్రదేశ్ | దింస, కోలాటం, బుట్ట బొమ్మలు |
| అరుణాచల్ ప్రదేశ్ | పోనుంగ్, టపు డాన్స్, పక్కు ఇటు, రిఖంపడా |
| అస్సాం | ఓజా-పాలి, బిహు, బగురుంబా, ఝుమురా హొబ్జానై |
| బీహార్ | బిరహా, జాట్-జతిన్, జోగిరా, చైతీ |
| ఛత్తీస్‌గఢ్ | సైలా, సువా, గౌర్ మరియా |
| గోవా | తరంగమేల్, ఘోడెమోడ్ని, పెర్ని జాగోర్, రణమలే, రోమ్టా మెల్, ఫుగ్డి |
| గుజరాత్ | తిప్పానీ, రత్వాని ఘేర్, దాండియా రాస్, ధోలో రానో, సిద్ధిస్ యొక్క ధమాల్, శికార్ నృత్య, ఘేరియా నృత్య, ఆలేని-హాలేని |
| హర్యానా | ఫాగ్, స్వాంగ్, ధమ్యాల్ |
| హిమాచల్ ప్రదేశ్ | దంగ్రాస్, చర్బా, ఛమ్ చనక్ |
| జార్ఖండ్ | మర్దానీ ఝుమర్, పైకా డ్యాన్స్, సరైకేలా చౌ డాన్స్ |
| కర్ణాటక | యక్షగాన, డొల్లు కుణిత, వీరగాసే, ఉమ్మట్-ఆట్, బయలాట, కంసలే, హులివేష, బూట కోల, గారుడి గొంబె, జూదు హలిగి |
| కేరళ | చాక్యార్ కూత్తు, నంగ్యార్ కూతు, కుటియాట్టం, పాండయాని, తుల్లల్ |
| మధ్యప్రదేశ్ | స్వాంగ్, జవారా, మత్కీ, బరేడి, నౌరత, అహిరాయ్, భగోరియా, పర్ధౌని |
| మహారాష్ట్ర | ధంగారి గజ, లావణి, పోవడ నృత్యం |
| మణిపూర్ | తంగ్-టా, కర్తాల్ చోలోమ్, జాగోయ్, థబల్ చోంగ్బా, తండన్ ఫీచక్, లై హరోబా |
| మేఘాలయ | నోంగ్‌క్రెమ్, చాడ్ లాహో, చాడ్ సుక్రా, చాడ్ ప్లియాంగ్, అజెమా రోవా, చాంబిల్ మోవా, నప్పెప్‌గ్రికా |
| మిజోరం | చెరావ్, ఛీహ్ లామ్, సో లకియా, ఖుల్లం |
| నాగాలాండ్ | ఆలుయట్టు, అగుర్షికుకుల, సీతాకోకచిలుక నృత్యం, చంగై డ్యాన్స్, లేషాలప్టు, మోడ్సే, మోనియోషో, సదల్ కేక్రై, మోయాషై, ఖుపిలీలీ, జెలియాంగ్ డ్యాన్స్, చాంగ్‌లో |
| ఒడిశా | దల్ఖాయ్ డ్యాన్స్, మయూర్భంజ్ ఛౌ, దండ జాత్రా, రణప, ఘుమురా డ్యాన్స్ |
| పంజాబ్ | భాంగ్రా, గిద్దా, లుడ్డీ, జుల్లి, గట్కా |
| రాజస్థాన్ | భావాయి, ఘూమర్, కల్బెలియా, తెరహ్ తాలీ |
| సిక్కిం | భూటియా డ్యాన్స్, లెప్చా డ్యాన్స్, సింఘీ ఛామ్ |
| తమిళనాడు | కరకట్టం, కుమ్మి, కోలాట్టం, మయిల్ ఆట్టం, పొయిక్కల్ కుదిరై ఆట్టం, తేరు కూతు, ఒట్టన్ కూతు, సేవై అట్టం |
| తెలంగాణ | పేరిణి శివతాండవం, చిందు భాగవతం |
| త్రిపుర | హొజాగిరి, ధమైల్, మైమతా, గారియా, లెబాంగ్ బొమానీ, సంగ్రాయ్మోగ్ డ్యాన్స్, చాన్ లామ్, మొసక్ సుమాని ఫీఫిత్ లామ్, వైఖోంగ్ లాం, లాం-లామ్, దార్-లామ్, ఖోంగిలామ్ డాన్స్ |
| ఉత్తరాఖండ్ | లాంగ్వీర్ నృత్య, చంపులి, చోలియా నృత్యం, చంచరీ నృత్యం, జోడా నృత్యం, హుర్కియా బౌల్ |
| పశ్చిమ బెంగాల్ | పురూలియా ఛౌ, గౌడియా నృత్య, అల్కప్, రవీంద్ర నృత్య, ధాలీ, రైబెంషే, బ్రతాచారి, కాళీ నాచ్, బౌల్ డ్యాన్స్ |
| లడఖ్ | జబ్రో, తుఖస్తాన్మో, షోండోల్, షోన్ మరియు కోషన్ |



కథ

# గౌను

ఒక ఊరిలో రమ్య, స్వాతి అనే ఇద్దరు మిత్రులు ఉండేవారు. వాళ్ళు చాలా మంచి మిత్రులు అదే ఊరిలో అర్చన అనే అమ్మాయి కూడా ఉండేది. తను చాలా చెడ్డది. ఎప్పుడు అందరిని ఏడిపిస్తూ ఉంటుంది. అందుకే తనతో ఎవరు ఉండరు. ఎందుకంటే తను చాలా చెడ్డది.

ఓ రోజు అర్చన పుట్టిన రోజు వస్తుంది. అప్పుడు అర్చన పుట్టిన రోజు జరుపుకోవాలి అని అనుకుంటుంది. కాని తనకు మిత్రులెవరు లేరు అందుకే తన ఇంటి బయట కూర్చుని ఏడుస్తు ఉంటుంది. అప్పుడే రమ్య, స్వాతి అర్చన వాళ్ళ ఇంటి ముందు నుంచి వెళుతున్నారు. అప్పుడే అర్చన ఏడవడం చూశారు. అప్పుడు రమ్య అంటుంది రేపు తన పుట్టిన రోజు తనకి మిత్రులెవరు లేరు కదా! అందుకే తను ఏడుస్తుంది అని. అవును అని స్వాతి అంటుంది.

అప్పుడు రమ్య మనం తన పుట్టిన రోజును జరిపిద్దాం అని అంటుంది. స్వాతి తను చాలా చెడ్డది అని అంటుంది. రమ్య ఏమీ కాదు మనం జరిపిద్దాం అంటుంది. సరే వెళ్ళదాం పదా అని వెళ్తారు. వాళ్ళు వెళ్ళుతుండగా అక్కడ గౌను కనిపించింది. అది చాలా అందంగా ఉంది. అప్పుడు స్వాతి అంటుంది. మనం దీన్ని అర్చనకు ఇద్దాం అని అంటుంది. సరే వెళ్దాం అని రమ్య అంటుంది. దాన్ని అర్చనకు ఇస్తారు. అర్చన దాన్ని తీసుకొని వేసుకుంటుంది. అంటే గౌనులో నుంచి మాటలు వినిపిస్తాయి. 'ఏమని అంటే నీకు ఏమి కావాలో కోరుకో' అని అప్పుడు తను నేను నా మిత్రులు చాలా బాగుండాలి. అని కోరుకుంటుంది. దాంతో రమ్య, స్వాతి ఇద్దరు అర్చనతో స్నేహం చేస్తారు. తను అందరిని ఏడిపించిన నా ఏడ్పును ఆపడానికి డబ్బులు జమచేసుకొని ఒక మంచి గౌను కానుకగా ఇవ్వడం, పుట్టిన రోజు జరపడం తను చేసిన తప్పేమిటో తెలుసుకొని బాధ పడింది.

– చిట్యాల లక్షణ
7వ తరగతి, కె.జి.బి.వి, తంగళ్లపల్లి
m : 8985279849



పుస్తక సమీక్ష

# చదువు మహిమ




కథలంటే ఎవరికి ఇష్టం ఉండదు. అందరికీ ఆ బాల గోపాలానికి ఇష్టమే. విజ్ఞానం, వినోదం, వికాసం కల్గిస్తాయి. పాఠ్యాంశాల్లోని ఒక భాగమే కథలు.

జంతువుల కథలు, మనుషుల కథలు, నీతిని, విలువల్ని తెలిపేవి అనేకం కాని అట్టి కథలకు భిన్నమైనవి ఈ 'మంత్రదండం' కథలు.

ఇవేవి జానపద, మంత్రతంత్రాల కథలు కావు. కళ్లముందు కన్పడుతున్న, కన్పడిన, నమ్మకాల, మూఢనమ్మకాల దృశ్యాలు గల కథలు. వీటిని రాసింది పెద్దలు కాదు, పిల్లలే. వారు బడికి వెళ్లేటప్పుడు బజారుకు వెళ్లేటప్పుడు దారుల్లో, బతుకు దారుల్లో కన్పడిన సన్నివేశాల సమాహారం.

పిల్లలు రాసే కథల్లో సాహిత్య ప్రక్రియ లక్షణాల కంటే యాస భాషల కంటే వారి ఆలోచనలకు పెద్ద పీట వేయడం ప్రధానం.

మూఢనమ్మకాలను వమ్ముచేసే నమ్మకమైన కథలు, సృష్టికి ప్రతిసృష్టి చేస్తున్న ఈ కాలం, అవని నుండి అంతరిక్షం దాకా విహరిస్తున్న గ్రహాలుదాటి పయనిస్తున్న మనిషిలోని మూఢనమ్మకాలు ఇంకా తొలగిపోలేదు. అటువంటి నిత్య జీవితంలోని, తుమ్మిన, దగ్గిన, పిల్లి అడ్డం వచ్చిన, వెళ్ళే వారి పనులకు అపశకునమని, ఆటంకమని, పనులు వాయిదా వేసుకోవడం, దానితో కష్టాలు, నష్టాలు కథల్లో కనపడుతాయి. అపశకునాలని, మూఢనమ్మకాల వల్ల కలిగే నష్టాలు తెల్పుతాయి. అలాగే మూడు తొవ్వల కాడి నిమ్మకాయలు, పచ్చన్నం, నాల్గు తొవ్వల కాడి కోడిగుడ్లు వంటి దృశ్యాలు కథల్లో కన్పిస్తాయి. వాటి ప్రభావం వల్ల నష్టాలు, కష్టాలు, అనారోగ్యాలు కల్గుతాయనెడి భ్రమలు. అనవసర భయాలు, ఆందోళనలు, గతకాలం నుండి వస్తున్న మూఢాచారాల వల్లనేనని, మనోధైర్యమే మందని అకారణ భయం వద్దని తెల్పుతాయి.

మనలోని అజ్ఞానాన్ని నిరక్షరాస్యతని గ్రహించి మాయలని, మంత్రాలని, చేతబడులని కొంతమంది స్వార్థపరులు మోసం, దగా చేసి పబ్బం గడుపుతారని, మంత్రతంత్రాల ద్వారా రోగాలను నయం చేస్తామని, నరదృష్టి వంటి అనేక రుగ్మతలను తగ్గిస్తామని ప్రచారం చేస్తారు. అటువంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని వారి బండారం బట్టబయలు చేయడానికి చదువొక్కటే మార్గమని, బడిలోని పాఠాల ప్రయోగాల ద్వారా బతుకు బడిపాఠాలను ప్రదర్శిస్తారు. వారి మోసాలను ఆటకట్టిస్తారు.

మూఢనమ్మకాలపై మూఢాచారాలపై మ్యాజిక్, లాజిక్ కథల 'మంత్రదండం' ఈ కథలయ్యాయి. గుండ్రాంపల్లి బడిపిల్లల కథలు కథారచనల్లో, వస్తువులో కొత్త ఒరవడి, నూతన ఆలోచనలకు పునాది. కథలకు వస్తువు ఎక్కడోలేదు. వెతకాల్సిన అవసరం లేదు. కళ్లముందు కన్పడుతున్న అనేక సంఘటనలు, సన్నివేశాలు కథలకు వస్తువులే అని నొక్కి చెబుతున్నారు.

కవయిత్రి, రచయిత్రి, ఉపాధ్యాయిని, పరిశోధకురాలైన డా॥ ఉప్పల పద్మ గారు పిల్లల మనసెరిగిన వారు. గతంలోను పలు పిల్లల రచనల సంకలనాలు వెలువరించిన వారు, కార్యశాలలు నిర్వహించినవారు కావడం, సృజనాత్మక రచనలు పాఠ్యాంశాలకు ముడిపెట్టి రాయించడం వీరికి వీరేసాటి. మిగతా వాటికంటే భిన్నంగా మూఢాచారాలపైన, మూఢనమ్మకాలపైన పిల్లలచేత కథలు రాయించడం, పుస్తకం తేవడం, బడిపిల్లల రచనల్లో ఒక ప్రత్యేకత. అందుకు అభినందనలు. అన్ని సమస్యలకు పరిష్కారం చూపే మహిమ గలది చదువు, విన్న, కన్న, చూసిన దృశ్యాలను కథలుగా మలచిన చిన్నారులకు ఆశీరభినందనలు.

చివరగా... కథల 'మంత్రదండం' చూడండి. మీరు వెళ్తున్న 'దారి'లో కన్పడుతున్న కొన్ని దృశ్యాలే ఇవి.

- గరిపెల్లి అశోక్
ప్రముఖ బాల సాహితీవేత్త
m : 9849649101

చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ
హైదరాబాద్ (Regd. 720/1982)
బాలచెలిమి
చెలిమి
పిల్లల వికాస పత్రిక
గ్రంథాలయం

# బాలచెలిమి గ్రంథాలయం మా మంచి నేస్తం



బాలచెలిమి గ్రంథాలయం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల సిరిసిల్ల విద్యార్థులకు ఒక మంచి పుస్తకం. ఒక మార్గదర్శి. ఒక స్నేహితురాలు స్నేహితుడు. ఈ గ్రంథాలయం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నది. ప్రతిరోజు పాఠశాలలో రేడియో కార్యక్రమం జరుగుతుంది. ఈ రేడియో కార్యక్రమంలో పుస్తకాల నుండి కథలు, కవితలు విద్యార్థులు చదువు తుంటారు. గ్రంథాలయాల ద్వారా పుస్తకాలు, పత్రికలు, పరిశోధన వనరులు వంటి అనేక సమాచారాన్ని పొందవచ్చు. వారి జ్ఞానాన్ని విస్తరించడంలో, సృజనాత్మకతను పెంపొందించడంలో ఉపయోగపడతాయి.

బాలచెలిమిలో మంచి మంచి కథలు విజ్ఞానానికి సంబంధించిన విషయాలు తెలుసుకుంటూ విద్యార్థులు నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ పాఠశాలలో ఎనిమిది వందల మంది విద్యార్థులు ఉన్నారు. మా పాఠశాలకు గ్రంథాలయం ఏర్పాటుకు అవకాశం ఇచ్చి పిల్లల్లో బాల వికాసానికి తోడ్పాటు ఇస్తున్న చిల్డ్రన్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ మణికొండ వేదకుమార్ గారికి ధన్యవాదాలు. మన బాలచెలిమి గ్రంథాలయం పుస్తకాల ద్వారా కథలు కవితలు వ్యాసాలు, విజ్ఞానానికి సంబంధించిన విషయాలన్నీ బాగా నేర్చుకుంటున్నాము. అలాగే మేము స్వంతంగా కథలు కూడా రాయగలుగుతున్నాము అందుకు కృతజ్ఞతలు.

గ్రంథాలయాలు విద్యార్థులను సమాజంలో సక్రియ సభ్యులుగా మారడానికి ప్రేరేపిస్తాయి. సామాజిక చైతన్యం మరియు బాధ్యతను పెంపొందిస్తాయి.

**– ఎల్. శారదా,** ప్రధానోపాధ్యాయులు

గ్రంథాలయం వల్ల విద్యార్థులకు చాలా ఉపయోగాలు ఉంటాయి. పుస్తకం వల్ల ప్రపంచంలో మేధావులు రాసినటువంటి సాహిత్యాన్ని మనకు అందిస్తది అట్లాగే జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుంది. సృజనాత్మకతను పెంపొందించడంలో, మరియు సమాజంలో సక్రియ సభ్యులుగా మారడంలో సహాయపడుతుంది.

**– ఇ. వెంకట్రాములు,** ఉపాధ్యాయులు

**– ఎలగొండ రవి**
వృత్తి విద్య ఉపాధ్యాయులు
జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, గీతానగర్, సిరిసిల్ల
m: 9848770345

## మంత్రదండం కథల సంపుటి ఆవిష్కరణ



07.02.2025న ప్రముఖ రచయిత్రి, ఉపాధ్యాయిని డాక్టర్ ఉప్పల పద్మ సంపాదకత్వంలో గుండ్రాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రచించిన 'మంత్రదండం' కథల సంపుటిని హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. సాహిత్య రంగంలో విద్యార్థులు ముందు వరుసలో నిలవాలని, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే దిశగా విద్యార్థులలో సృజనాత్మక ఆలోచనలు, మారుతున్న కాలానికి అనుగుణంగా రచనలు రావాలని, సమాజ వికాసం సాహిత్యంతోనే సాధ్యమని ఆయన అన్నారు. రచయిత్రిగా, ఉపాధ్యాయినిగా ఉప్పల పద్మ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. విద్యార్థులు రచించిన కథలను చదివి వారి ప్రతిభను ప్రశంసించారు. త్వరలోనే పాఠశాలను సందర్శిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ అధ్యాపకులు డాక్టర్ సాదం ఐలయ్య, ఎస్సీఈఆర్టీ ఫ్యాకల్టీ పఠాన్ ఎఫ్ ఖాన్, పల్లెర్ల సురేందర్, చిలుకూరి మధు, నాగరాజు పాల్గొన్నారు.

## కథా సంపుటాలకు ఆహ్వానం..

"వెన్నెల సాహితీ పురస్కారం-2024" కొరకు.. 2023, 2024 సంవత్సరాలలో ప్రచురించిన కథా సంపుటాలు నాలుగు (4) ప్రతులను ఈ క్రింది చిరునామాకు, 31 మార్చి 2025 లోపు పంపగలరు. సిద్ధిపేటలో జరుగు సాహిత్య కార్యక్రమంలో నగదు పురస్కారం అందజేయబడును. చిరునామా, పి. యాదగిరి, ఇం.నెం.17-3-86/35, జ్యోతి నిలయం, వినాయక్ నగర్ రోడ్-2, మయూరి బార్ & రెస్టారెంట్ ఎదురు వీధి, రంగధాంపల్లి చౌరస్తా దగ్గర సిద్ధిపేట-502103, ఫోన్: 9299909516, 9848261284

**– పర్కపెల్లి యాదగిరి,** వెన్నెల సాహితీ సంగమం, ప్రధాన కార్యదర్శి

## సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాల (ఆర్మూర్)లో "తొలి కిరణాలు" పుస్తకావిష్కరణ

వడ్ల శ్రీజ రచించిన "తొలి కిరణాలు" కవితా సంపుటిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. ఎన్. చంద్రిక గారు ఆవిష్కరించారు. శ్రీజ చిన్న వయస్సులోనే రచనపట్ల మక్కువ పెంచుకొని కవిత్వం వైపు అడుగులు వేయడం అభినందనీయం. ఈ కవితలు ఆమె అభివృద్ధి మరియు సృజనాత్మకతను ప్రతిబింబిస్తాయి.

వడ్ల శ్రీజ ఆరవ తరగతి నుంచి గ్రంథాలయ పుస్తకాలు చదువుతూ తన తెలుగు టీచర్ డాక్టర్ శారదా హన్మాండ్లు గారి సహకారంతో చిన్న చిన్న కవితలు రాయడం నేర్చుకుంది. పదో తరగతి వచ్చేనాటికి కవిత్వంలో మెళు కువలు నేర్చుకుంది. శ్రీజ రాసిన కవితలన్నింటినీ క్రోడీకరించి పుస్తకంగా ప్రచురించింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్. ఎన్. సుజాత, హెచ్ఎం సాయిలు, లెక్చరర్ శరణ్య మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## "అంజు" పుస్తకావిష్కరణ




ఫిబ్రవరి 1 నుండి 9వ తారీకు వరకు ఢిల్లీలో ప్రపంచ పుస్తక ప్రదర్శన జరిగింది. 7వ తేదీన డా. అమరవాది నీరజ రచించిన అంజు (ఎనిమిది నుండి పది సంవత్సరాల పిల్లలకు సంబంధించినది) పుస్తక ఆవిష్కరణ జరిగింది.

డా. పత్తిపాక మోహన్, డా. అమరేంద్ర దాసరి, ప్రొఫెసర్ వెంకట్రామయ్య, ఆతెం దత్తయ్య మొదలగువారు పాల్గొన్నారు. ప్రపంచ పుస్తక ప్రదర్శనలో తెలుగు భాషలో పిల్లల పుస్తకం ఆవిష్కరించబడడం తెలుగు భాషకు, పిల్లలకు అందిస్తున్న కానుకగా భావించాలని పత్తిపాక మోహన్ అన్నారు. అలాగే దాసరి అమరేంద్ర అంజు కథను విశ్లేషణాత్మకంగా వివరించారు. పుస్తకాల సంచిని పిల్లల ఆనందాల్ని హరించేదని ప్రతీకాత్మకంగా సూచించిచటం బాగుందని తన హర్షాన్ని తెలియజేసారు. అలాగే ప్రొఫెసర్ వెంకట్రామయ్య మాట్లాడుతూ AI టెక్నాలజీ పెరిగినా పిల్లలు

కథలను ఇష్టంగా చదివే వాతావరణాన్ని NBT లాంటి సంస్థలు కల్పిస్తున్నాయని అన్నారు. ఆతం దత్తయ్య మాట్లాడుతూ చందమామ కథలని చదివిన మా తరం వారందరు కొత్తగా వస్తున్న అంజు లాంటి కథలు చదవాల్సిన అవసరం ఉందన్నారు. చివరగా రచయిత్రి అమరవాది నీరజ మాట్లాడుతూ అంజు మధ్య తరగతి బాలలందరికీ ప్రతినిధి అని, ఉన్న అవకాశాలతో ఎలా తన కలలను, ఇష్టాలను నేరవేర్చుకుందో చెప్పానన్నారు.

## పత్రికా ప్రకటన
## తేది : 10.02.2025
## "భూపతి చంద్ర" స్మారక కథానికల పోటి

సమకాలీన సామాజిక సమస్యలను ప్రతిబింబించే కథలకు ఆహ్వానం.

### బహుమతుల వివరములు

1. ప్రథమ బహుమతి రూ. 5,000/-
2. ద్వితీయ బహుమతి రూ. 3,000/-
3. తృతీయ బహుమతి రూ. 2,000/-
4. ప్రోత్సాహక బహుమతులు 5. ఒకొక్కరికి రూ. 1,000/-

### రచయిత / రచయిత్రులకు సూచనలు

1. కథానిక డి.టి.పి.లో ఎ4 సైజ్ నాలుగు పేజీలకు మించరాదు.
2. కథానికలు సమకాలీన సామాజిక సమస్యలను ప్రతిబింబించేవిగా ఉండాలి. హాస్యాన్ని మేళవించ గలిగితే మంచిది.
3. పోటీకి పంపుతున్న కథానిక గతంలో ఏ పత్రికలోను ప్రచురితమై ఉండకూడదు.
4. కథానిక తమ స్వీయ రచనేనని అనువాదం, అనుసరణ, అనుకరణ కాదని, గతంలో ఎక్కడా ప్రచురితం కాలేదని, పరిశీలనలో కూడా లేదని హామీ పత్రం జత చేయాలి.
5. రచయితలు / రచయిత్రులు తమ కథ పేరును, తమ కలం పేరుతో పాటు స్వంత పేరును, పూర్తి చిరునామాను, ఫోన్ నంబర్‌ను కథానికతో పాటు విడిగా జతపరచాలి. కథానిక ప్రతులలో రచయిత, రచయిత్రి పేరు ఉండకూడదు.
6. ఒక్కరు ఒక్క కథానికను మాత్రమే పంపాలి. రెండు కాపీలను పంపవలెను.
7. బహుమతుల విషయంలో న్యాయ నిర్ణేతలదే తుది నిర్ణయం. ఎలాంటి సంప్రదింపులకు అవకాశము లేదు. కథానికలు త్రిప్పి పంపబడవు.
8. పోటీకి పంపిన కథానికలను ప్రచురించే హక్కు నిర్వాహకులకు ఉంటుంది.
9. కథానికలు చేరవలసిన చివరి తేది : 10.03.2025.
10. బహుమతుల ప్రకటన తేది : 12.05.2025 దినపత్రికలలో ప్రకటించబడును.

**కథానికలు పంపవలసిన చిరునామా :**

సమన్వయకర్త, "భూపతి చంద్ర" స్మారక కథానికల పోటీ
ఆనంద నిలయం, ఇం.నం. 1-5-1020/4, బి.ఆర్.రావు నగర్,
ఓల్డ్ అల్వాల్, సికింద్రాబాద్-500010. ఫోన్: 99636 16999

**ఎమ్.ఎల్. కాంతారావు,** అధ్యక్షులు
"భూపతి చంద్ర" స్మారక కథానికల పోటీ
ప్రజ్ఞాపూర్, గజ్వేల్, సిద్దిపేట, తెలంగాణ.

## బొమ్మలేద్దామా...





ఎం. మేఘన,
9వ తరగతి, జెడ్‌పిహెచ్‌ఎస్, సిర్పూర్.

# గురజాడ అప్పారావు

## (1862-1915)

గురజాడ వెంకట అప్పారావు ఒక సామాజిక సంస్కర్త. సెప్టెంబర్ 21, 1862న విశాఖపట్నం జిల్లాలోని రాయవరం గ్రామంలో జన్మించారు. గురజాడను తెలుగు సాహిత్యంలో ఆధునికవాద మార్గదర్శకుడిగా భావిస్తారు. కన్యాశుల్కం పూర్తిగా మాట్లాడే మాండలికంలో రాసిన మొదటి తెలుగు నాటకం. ఒక శతాబ్దం తర్వాత కూడా, విశాఖపట్నం మాండలికంలో రాసిన కన్యాశుల్కం అనే గద్య నాటకం ప్రజాదరణ పొందింది. తన రచనల ద్వారా, బాల్యవివాహాలు మరియు వరకట్నం వంటి సామాజిక దురాచారాలను ఆయన తీవ్రంగా విమర్శించారు. మహిళా విద్య మరియు సాధికారతకు ఆయన బలమైన న్యాయవాది.



పుత్తడి బొమ్మ పూర్ణమ్మ, దేశమును ప్రేమించుమన్నా... మంచి అన్నది పెంచుమన్నా... అనే సుప్రసిద్ధ గేయాలు గురజాడ కలం నుండి జాలువారినవే... తెలుగు సాహిత్యంలో వాడుక భాష ఒరవడికి కృషి చేసిన వారిలో ముఖ్యుడిగా ఉన్న గురజాడ అభ్యుదయ మహాకవి, కవితా పితామహుడు, కవి శేఖర వంటి బిరుదులు పొందారు. 20వ శతాబ్ది తొలినాళ్ళలో జరిగిన వ్యవహారిక భాషోద్యమంలో గురజాడ అప్పారావు తన ప్రాణ స్నేహితుడు గిడుగు రామమూర్తి పంతులుతో కలిసి పోరాటం సలిపారు. వారిద్దరూ కలిసి పత్రికల్లో, సభల్లో, మద్రాసు విశ్వవిద్యాలయంలో గ్రాంథిక భాషావాదులతో అలసట ఎరగకుండా తలపడ్డారు. గిడుగు వాదనా బలానికి, గురజాడ రచనాశక్తి వ్యావహారిక భాషోద్యమానికి వినియోగపడ్డాయి.

గురజాడ మహారాజా ఆనంద గజపతి ప్రోత్సాహంతో కన్యాశుల్కం నాటకాన్ని సృష్టించాడు. ఈ నాటకం కన్యాశుల్కం ఆచారాన్ని మాత్రమే కాకుండా అవినీతి, భాషా సంస్కరణ, వితంతు పునర్వివాహాలు మరియు బాల్య వివాహాలు కూడా వర్ణిస్తుంది. ఆ కాలంలోని సున్నితమైన అంశాలను చర్చించడానికి హాస్యాన్ని ఉపయోగించారు.

1886లో విజయనగరం డిప్యూటీ కలెక్టరు కార్యాలయంలో హెడ్ క్లర్కుగా తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన గురజాడ అనతి కాలం లోనే మహారాజా పాఠశాలలో ఉపాధ్యాయునిగా, మహారాజ కళాశాలలో అధ్యాపకునిగా, సంస్థాన శాసన పరిశోధకునిగా, రీవా మహారాణి, అప్పల కొండమాంబ గార్లకు వ్యక్తిగత కార్యదర్శిగా ఎదిగారు. ఆ తరువాత 1911లో మద్రాసు విశ్వవిద్యాలయం గురజాడను బోర్డు అఫ్ స్టడీస్‌లో నియమించింది. అదే సంవత్సరంలో, తన స్నేహితులతో కలిసి గురజాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తు ప్రారంభించాడు.

1913లో పదవీ విరమణ చేసిన గురజాడ అప్పారావు అప్పటి నుండి అనారోగ్యంతో బాధపడ్డారు. ఇదే సమయంలో మద్రాస్ విశ్వవిద్యాలయం వారు "ఫెలో"తో గౌరవించారు. 1915 నవంబరు 30న గురజాడ అప్పారావు (53 సంవత్సరాల వయసులో) అస్తమించారు. ఆయనకు మరణానంతరం 1954లో భారతదేశంలోని మూడవ అత్యున్నత పౌర పురస్కారం అయిన పద్మభూషణ్ లభించింది.

– సువేగ
(బాలచెలిమి)

# Oxford
Grammar High School

KNOWLEDGE IS POWER

ogs JUNIORS
grow naturally

43rd YEARS OF MERITORIOUS PERFORMANCE



## We make school time the **best time** for your kids

At OGS Juniors, all the children are given a warm, safe, and stimulating environment so that they can grow to become individuals while exploring, imagining, creating, and playing.

- **Loving atmosphere & play ground**
- **CCTV surveillance**
- **Certified teachers & caring staff**
- **Kids zone & play area**
- **Interactive & Value based Learning**

### CARING TEACHERS & STAFF
Your child will get the best care and attention

### ECO-FRIENDLY PRACTICES
We let the children play with nature friendly material

### HUGE PLAYGROUND
Your child will get lots of fresh air and playtime

### INTERACTIVE LEARNING
Our trusted method helps your child communicate and learn with ease.

**Street No. 13, Himayathnagar, Hyderabad | Ph : 040 2763 6214, 99590 20512**

BALA CHELIMI, Telugu Children's Monthly Magazine
Date of Publication - 24th February, 2024
Postal Dates: 24th & 26th Every Month

RNI Regn. No. 52828/1992 TC No. TEL Tel01232
Postal Regn.No.HCD-5022/2024-2026




Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, H.No.1-9-1126/B, Azamabad, Musheerabad, Hyderabad-500020, Telangana State.
Published at "CHANDRAM", # 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana.
Editor: Manikonda Vedakumar. RNI Reg No. 52828/92, Tc No: TEL Tel01232.
Cell : 9030626288, Mail ID : edit.chelimi@gmail.com